

- ఉధృతంగా పారుతున్న స్వర్ణముఖి, కాళంగి, కైవల్య నదులు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- అనేక మార్గాల్లో రాకపోకలు బంద్
- నిండుకుండల్లా మారిన రిజర్వాయర్లు
- తెగిపోయే స్థితిలో పలు చెరువులు

పుత్తూరు మండలం పైడిపల్లి కాజ్‌వేపై ఉధృతంగా ప్రవాహం

నేడు కూడా వానలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో శుక్రవారం కూడా వానలు కురుస్తాయి. జిల్లాలో చాలాచోట్ల వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి కలెక్టర్ శుభం బన్సల్ గురువారం హెచ్చరించారు. అధికారులు వాగులు, చెరువులు, వంకలను పరిశీలించి ఎప్పటికప్పుడు కరకట్టలను సరిచేయాలన్నారు. కాజ్‌వేలపై నీరు ప్రవహిస్తుంటే వాహన రాకపోకలను నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు. విపత్కర పరిస్థితి ఉంటే ప్రజలు కంట్రోల్ రూంలకు ఫోన్ చేయాలని కోరారు.

తిరుపతి కలెక్టరేట్ : 0877-2236007
తిరుపతి ఆర్డీవో ఆఫీసు: 7032157040
గూడూరు సబ్‌కలెక్టర్ ఆఫీసు: 9849904062
సూళ్లూరుపేట ఆర్డీవో ఆఫీసు: 9441984020
శ్రీకాళహస్తి 6281156474





కేవీబీపురం మండలం రాజుల కండ్రిగ వద్ద అవస్థలు

రేణిగుంట బాలాజీ కాలనీ వాసుల అవస్థలు

విడవని వాన

మళ్లీ వానలు విరుచుకుపడ్డాయి.
నదులు నిండుగా పారుతున్నాయి. వాగులు పొంగుతున్నాయి. చెరువులు తెగిపోయే స్థితికి చేరుకున్నాయి. బుధవారం రాత్రి నుంచీ కురిసినట్లే ఇంకొక్క రోజు గనుక వానలు కొనసాగితే జిల్లా అతలాకుతలం అయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే జిల్లాలో అనేక మార్గాల్లో రాకపోకలు ఆగిపోయాయి. 12 మార్గాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపివేశారు. తిరుమల కనుమ దారిలో కొండచరియలు విరిగి పడ్డాయి. గురువారం బడులకు వెళ్లాక సెలవు ప్రకటించడంతో జోరు వానలో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. వానలు కురుస్తున్నా జిల్లావ్యాప్తంగా రెవిన్యూ సదస్సులు నిర్వహించారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



తిరుపతి ఎస్టీవీనగర్



బీఎన్ కండ్రిగలో నీటమునిగిన వరి

నీట మునిగిన పంటలు

పెళ్లకూరులో పంటపొలాలు నీట మునిగాయి. ఏర్పేడు మండలంలో వానలకు చిందేపల్లిలో వరినాట్లు పూర్తిగా నీట మునిగిపోయాయి. నాయుడుపేట మండలంలోనూ అదే పరిస్థితి. ముఖ్యంగా పుదూరు గ్రామంలో బాగా దెబ్బతిన్నాయి.

బీఎన్ కండ్రిగలో 16.2 సెంటీమీటర్ల వాన

జిల్లాలో గురువారం సాయంత్రం 5 గంటల వరకూ 78 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా చూస్తే బీఎన్ కండ్రిగలో అత్యధికంగా 162.6, డక్కిలిలో 136.4, బాలాయపల్లిలో 117.4, సూళ్లూరుపేటలో 117, వరదయ్యపాలెంలో 109.8, తడలో 107.4, కేవీబీపురంలో 104.2, వెంకటగిరిలో 97.2, పుత్తూరులో 91.8, శ్రీకాళహస్తిలో 91.4, తొట్టంబేడులో 91 మిల్లీమీటర్లు చొప్పున భారీగా వర్షపాతం నమోదైంది. చిల్లకూరులో అత్యల్పంగా 26.4 మిల్లీమీటర్ల వాన కురిసింది.

జలకళలాడుతున్న రిజర్వాయర్లు

వాకాడు మండలంలోని స్వర్ణముఖి బ్యారేజీలోకి భారీగా వరద నీరు చేరుతోంది. బ్యారేజీ నుంచీ 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కేవీబీపురం మండలంలో కాళంగి రిజర్వాయర్ పది గేట్లు ఉదయం పది గంటలకే ఎత్తివేసి నీటిని దిగువకు వదిలారు. రేణిగుంట మండలం మల్లిమడుగు రిజర్వాయర్‌లోకి నీరు వస్తోంది. నాలుగు గేట్లు స్వల్పంగా ఎత్తి 700 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడున్నారు. పిచ్చాటూరు మండలంలో అరణియార్ గేట్లు ఎత్తివేసి వెయ్యి క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. చంద్రగిరి మండలం కళ్యాణి డ్యామ్‌లోకి నీరు చేరుతోంది.



పరవళ్ళు తొక్కుతున్న కాళంగి



మల్లిమడుగు దూకుడు

నిండుగా నదులు..పొంగుతున్న వాగులు

జిల్లాలో స్వర్ణముఖి, కాళంగి, కైవల్య నదులు నిండుగా పారుతున్నాయి. శ్రీకాళహస్తిని ఒరుసుకుంటూ స్వర్ణముఖి నది ప్రవహిస్తోంది. ఇదే నది పెళ్లకూరు మండలంలో పోటెత్తి దూకుతోంది. వెంకటగిరిలో కైవల్య నది ఉధృతంగా ఉంది. సూళ్లూరుపేటలో కాళంగి ఉధృతి పెరిగింది. నాయుడుపేటలో మామిడి కాలువ పొంగింది. జిల్లావ్యాప్తంగా 12 మార్గాల్లో 43 బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు.



తడ వద్ద నదిలా జాతీయ రహదారి

- కేవీబీపురం మండలంలో పూడి ప్రాంత గ్రామాలకు వెళ్లే వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు స్తంభించాయి. రేణిగుంట మండలం గాజులమండ్యం-కల్లూరు మార్గంలో కల్లూరు కాలువ, అన్నాసామిపల్లి మార్గంలో వాగు, అత్తూరు వాగు వంటివి పొంగడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిపివేశారు.
- బీఎన్ కండ్రిగ మండలంలో సీత కాలువ, పంది కాలువ, కాళంగి నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలను పూర్తిగా ఆపేశారు.
- వరదయ్యపాలెం మండలంలో గోవర్ధనపురం వద్ద మారేడు కాలువ పొంగడంతో రాకపోకలు బంద్ అయ్యాయి.
- శ్రీకాళహస్తి మండలం కాపు గున్నేరు గ్రామం వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నీట మునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
- స్వర్ణముఖి ప్రవాహ ఉధృతి కారణంగా శ్రీకాళహస్తి నుంచీ పిచ్చాటూరు మార్గంలో రాకపోకలు ఆపేశారు. ఇదే మండలం ముళ్లపూడి ఎస్టీ కాలనీ, ఉడవలపాడు, ముచ్చువోలు, గంగలపూడి, ఓబులాయిపల్లి, దొమ్మరపాలెం గ్రామాల వద్ద వాగులు పొంగాయి. కాజ్‌వేలపైకి వరద నీరు చేరడంతో ఆయా గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు.



రేణిగుంట మండలం కల్లూరు వద్ద..

- తొట్టంబేడు మండలం కారాకొల్లు, చిట్టత్తూరు మార్గాల్లో కాలువలు పొంగడంతో రాకపోకలు ఆగాయి.
- వడమాలపేట మండలం నేసనూరు వద్ద వాగు పొంగడంతో రోడ్డుపై రాకపోకలు నిలిపివేశారు. వడమాలపేట మండలం గూళూరు చెరువు నిండిపోయి కలుజు పారుతోంది. ● వేమాపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు చేరడంతో ఓ కారు చిక్కుకుపోయింది.
- ఏర్పేడు మండలంలో సీత కాలువ ప్రవాహ వేగం పెరగడంతో గుడిమల్లం ఆలయానికి భక్తుల రాకపోకలను అధికారులు ఆపేశారు.

ప్రమాదకర స్థితిలో చెరువులు

సూళ్లూరుపేటలో భారీ వర్షం కురుస్తుండడంతో గురువారం రాత్రికి కాళంగి నది, పాముల కాలువ పొంగే ప్రమాదం వుంది. దీంతో అధికారులు ఆ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. తడ మండలం కాదలూరు, వెండ్లూరుపాడు, మాంబట్టు చెరువులకు ప్రమాదం పొంచి వుంది. పెళ్లకూరు మండలంలో కూడా పలు చెరువులు ప్రమాకర స్థితికి చేరుకున్నాయి. నాయుడుపేట మండలంలో ఇప్పటికే అన్ని చెరువులూ నిండిపోగా గురువారం రాత్రి కూడా వాన కొనసాగితే పలు చెరువులు తెగిపోయే ప్రమాదం వుంది. బీఎన్ కండ్రిగ మండలంలో కంచన పుత్తూరు చెరువు ప్రమాదకరంగా మారింది. వడమాలపేట మండలం పాదిరేడు చిన్న చెరువు కట్ట ప్రమాదకర స్థితికి చేరింది.



కలుజులో జారిపడి రైతు మృతి

శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పొలానికి వెళుతూ కలుజు వద్ద కాలు జారిపడి రైతు శ్రీనివాసులు(60) మృతిచెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం అబ్బాబట్లపల్లిలో గురువారం చోటు చేసుకుంది. అబ్బాబట్లపల్లికి చెందిన శ్రీనివాసులు గురువారం ఇంటి నుంచి పొలానికి వెళ్లే క్రమంలో కలుజు వద్ద నీటిలో పడటంతో మృతి చెందాడు. స్థానికులు గుర్తించి మృతదేహాన్ని ఇంటికి చేర్చారు. కుటుంబ సభ్యులు ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామానికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదు.

తిరుపతి పద్మావతి కళ్యాణ మండపాల వద్ద కాలువలా మారిన రోడ్డు



పేర్నాడు రోడ్డు కోతను పూడ్చిన గ్రామస్తులు

సూళ్లూరుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పులికాట్ సరస్సు మధ్యలో ఉన్న పల్లెలకు వెళ్లే కొరిడి-పేర్నాడు రోడ్డు కోతకు గురైంది. అలల ఉధృతికి ఈ రోడ్డు అట్టకానితిప్పకు 2 కిలోమీటర్ల సమీపంలో కోతకు గురైంది. ఆర్టీసీ బస్సును రద్దు చేశారు. వెంటనే గ్రామస్థులే పూనుకొని ట్రాక్టర్లతో ఇసుక బస్తాలతో కోతకు గురైన రోడ్డును పూడ్చి మరమ్మతులు చేశారు.





చెరువులా మారిన తిరుపతి బస్టాండు

ప్రపంచ చెస్ ఛాంపియన్

గుకేష్ మనవాడే

చెంచురాజు కండ్రిగలో సంబరాలు



పిచ్చాటూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పద్దెనిమిదేళ్ల వయసులోనే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ గెలుచుకుని చరిత్ర సృష్టించిన యువ గ్రాండ్ మాస్టర్ గుకేష్ దొమ్మరాజు పూర్వీకులది తిరుపతి జిల్లా కావడం విశేషం. పిచ్చాటూరు మండలంలోని చెంచురాజు కండ్రిగకు చెందిన భూస్వామి శంకర్‌రాజు మనవడే గుకేష్. రైల్వే ఉద్యోగిగా చెన్నై తరలివెళ్లిన శంకర్‌రాజు కొడుకైన రజనీకాంత్ అక్కడే డాక్టర్‌గా స్థిరపడ్డారు. నగరానికే చెందిన డాక్టర్ పద్మావతిని వివాహమాడారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గుకేష్ చిన్నప్పటి నుంచీ చెస్ క్రీడపై మక్కువ పెంచుకుని ప్రతిభ చాటుతూ వచ్చాడు.శంకర్‌రాజుకు చెంచురాజు కండ్రిగలో భూములతో పాటు రైస్ మిల్ కూడా ఉండడంతో అప్పుడప్పుడూ సొంతూరికి వచ్చిపోతుంటారు. గుకేష్ ప్రపంచ చెస్ ఛాంపియన్ కావడంతో చెంచురాజుకండ్రిగ గ్రామస్తులు సంతోషంలో మునిగితేలుతున్నారు.

16 నుంచి ముక్కంటి ఆలయ దర్శన వేళల్లో మార్పు

శ్రీకాళహస్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 16వ తేదీ నుంచి దర్శన వేళల్లో మార్పు చేసినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. తెల్లవారుజాము 3 గంటలకు జేగంట, 4కు మంగళ వాయిద్యాలు, 4.15కు గోపూజ, తిరుమంజనం, 4.30కు పల్లియర పూజ(సుప్రభాతం లేదు), తేవారము ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 5కు సర్వదర్శనం, మొదటికాల అభిషేకం(సేవలు లేవు), 6కు రెండో కాలాభిషేకం, 7కు పరివార దేవతా నైవేద్యం, 7.30కు గొబ్బెమ్మవార్ల ఉత్సవం, 10.30కు మూడవ కాలాభిషేకం(ఉచ్చికాలం), సాయంత్రం 5కు ప్రదోష కాలాభిషేకం, శుక్ర, శని, ఆది, సోమవారాల్లో రాత్రి 9 గంటలకు పల్లియపూజ, దర్శనం ముగింపు. మంగళ, బుధ, గురువారాల్లో రాత్రి 9 గంటలకు పల్లియర పూజల అనంతరం దర్శనం ముగింపు ఉంటుందని ఈవో వివరించారు.

రెవెన్యూ సదస్సులకు 556 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో గురువారం నిర్వహించిన 51 గ్రామసభల్లో 556 అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శుభం బన్సల్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం కురుస్తున్నా సదస్సులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు మొత్తం 5,127 అర్జీలు అందాయని తెలిపారు. అందులో భూ కబ్జాలు, రీసర్వే, 22ఏ, ఇంటి స్థలాలు, అసైన్‌మెంట్‌ల్యాండ్,ఆర్‌వోఆర్, క్యాస్ట్ వెరిఫికేషన్ తదితర సమస్యలపై వచ్చినట్లు తెలిపారు.

నేడు కూడా విద్యా సంస్థలకు సెలవు

తిరుపతి(విద్య), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో శుక్రవారం కూడా ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. దీన్ని తప్పక పాటించాలని సూచించారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వెంకటంపేట వద్ద రహదారిపై వరద

చంద్రగిరి, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వాలు మారుతున్నా వెంకటంపేట వద్ద రహదారిపై వరద నీరు నిల్వ సమస్య పరిష్కారం కావడంలేదు. చంద్రగిరి నుంచి జాతీయ రహదారిలోకి వెళ్లే మార్గంలో వెంకటంపేట వద్ద వర్షం వస్తే రోడ్డుపైన వరద నీరు నిల్వతో వెంకటం పేట గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



వెంకటంపేట వద్ద సీసీ రోడ్డుపై నిలిచిపోయిన నీరు

గతంలో చంద్రగిరి నుంచి జాతీయ రహదారి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇంజనీర్ల పర్యవేక్షణ లోపంతో వెంకటంపేట వద్ద రోడ్డు లోతట్టు ప్రాంతంగా ఏర్పడింది. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై భారీగా వరద నీరు నిలిచిపోతుంది. ఆదారిలో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిలో నిత్యం కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రా రాష్ట్రాల నుంచి తిరుమల శ్రీవారి దర్శనార్థం భక్తులు కాలినడకన వస్తుంటారు. రోడ్డుపై వర్షపు నీటి వలన ఆనీటి మడుగులోనే నడవాల్సి వస్తోంది. గత నెలలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఈసమస్యపై స్పందించి వెంకటంపేట వద్ద సీసీ రోడ్డుపై వర్షపు నీరు నిల్వకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

తిరుచానూరులో పలు కాలనీలు జలమయం





తిరుచానూరులో రోడ్లపై చేరిన వర్షపునీరు,
కలెక్టరేట్ వద్ద షికారీకాలనీలో వర్షపునీటిని మళ్లిస్తున్న పంచాయతీ కార్మికులు

తిరుచానూరు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా గురువారం ఏక దాటిగా కురిసిన వర్షానికి తిరుపతి రూరల్ మండలంలో పలుప్రాంతాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా తిరుచానూరు గ్రామ పంచాయతీలో కేవీ.నగర్, చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ, యోగిమల్లవరం తదితర కాలనీలు నీటమునిగాయి. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది. కొన్నిచోట్ల తిరుచానూరు గ్రామ పంచాయతీ కార్మికులు వరదనీటిని మళ్లించారు. పంచాయతీ కార్యాలయం, జడ్పీ హైస్కూల్ రోడ్డులో భారీగా వరదనీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈవోపీఆర్డీ మాధురి పంచాయతీ సిబ్బందితో కలిసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. కాలువలు శుభ్రం చేయించారు.

రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోండి

పాకాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలు రెవెన్యూ సదస్సును సద్వి నియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని మొగరాల సర్పంచ్ మధు నాయుడు కోరారు. గురువారం తోటతిమ్మయ్య గారిపల్లెలో తహసీల్దార్ నిత్యానందబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి రెవెన్యూ అధికారులు వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సదస్సులో టీడీపీ నాయకులు శ్రీనివాసులు నాయుడు, సిద్ధయ్యనాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సు నిర్వహిస్తున్న తహసీల్దార్ నిత్యానందబాబు

మజ్జిగ కాలువ నిర్మాణం పటిష్టంగా చేపట్టండి



తిరుచానూరు, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఈఎస్ఐ ఆస్పత్రి, సాయినగర్, లింగేశ్వరనగర్, రాఘవేంద్రనగర్ మీదుగా వెళ్లే మజ్జిగ కాలువను పటిష్టంగా నిర్మించాలని సాయినగర్ సర్పంచ్ డి.వి.రమణ గురువారం మున్సిపల్ కమిషనర్ మౌర్యకు వినతిపత్రం అందించారు. అలాగే కేశవాయనగుంటలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని విన్న వించారు. ఆయనవెంట వార్డు మెంబర్లు ఉన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నీటిలో చిక్కుకున్న కారు



వడమాలపేట, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమాపురం రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీటిలో కారు చిక్కుకుంది. గురువారం ఉదయం వడమాలపేట నుంచి అప్పలాయగుంటకు వెళ్తున్న కారు బ్రిడ్జి నుంచి వెళ్తుండగా ఉన్నట్టుండి ఇంజిన్ ఆగిపోయింది. కొంతసేపటికి కారు పూర్తిగా మునిగిపోయే స్థితికి చేరుకుంది. ఇంతలో అక్కడే ఉన్న స్థానికులు కారు దగ్గరకు చేరుకుని డోర్లు తెరిచి లోపల ఉన్న ఇద్దరిని రక్షించారు. అనంతరం ట్రాక్టర్ సాయంతో కారును బయటికి లాగారు.

గ్రామస్తులకు భోజనం పంపిణీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పంచాయతీకి చెందిన గణపతి ఎస్టీకాలనీవాసులకు భోజనం పంపిణీ చేశారు. తుఫాన్ కారణంగా ఇబ్బంది పడుతున్న స్థానికులకు రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో భోజనం పంపిణీ చేశారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉమ్మడిగా కాలనీవాసులకు భోజనం అందజేశారు.

డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం



శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తితో ప్రతి గురువారం అన్నదానం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో అన్నదానం చేశారు. చంద్రశేఖర్, జ్యోతిరాం, పేట చిరంజీవి, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం



న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీ శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ కోరారు. ఉదయం 10.30గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్, వివాహ, మోటరు వాహన సంబంధ కేసులతో పాటు రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, వ్యాజ్యం వేయని కేసులు పరిష్కరిస్తామన్నారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు వివిధ సంస్థ అధికారులు ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం కావడానికి కృషి చేయాలన్నారు.

సంతాన సంపద వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఏర్పేడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాలలో కొలువై ఉన్న సంతానసంపద వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి నేత్రదర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్త పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు కృష్ణమాచార్యులు, రత్నాకరం ఆచార్యులు స్వామివారిని అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు.

చంద్రగిరి

పచ్చారోని ఒడ్డు గండి పూడ్చివేత

ఎర్రావారిపాళెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతగుంట పంచాయతీలోని పచ్చారోని ఒడ్డుకు పడిన గండిని రెవెన్యూ అధికారులు పూడ్చించారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు శేషాచల అటవీ సరిహద్దు వున్న గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. ఈ క్రమంలో పచ్చారోని చెరువు ఒడ్డుకు తూము వద్ద గండి పడింది. ఈ విషయాన్ని రైతులు రెవెన్యూ అధికారులకు తెలియజేశారు. గురువారం రాత్రి తహసీల్దార్ పరమేశ్వర స్వామి, ఎస్ఐ స్వామి స్థానికులతో కలిసి ఎక్స్‌కవేటర్ సాయంతో గండిని పూడ్చించారు. మండలంలో 20 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని తహసీల్దార్ తెలిపారు.

ఫర్నిచర్ షాపు ప్రారంభం



చంద్రగిరి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం తొండవాడ వద్ద టీడీపీ నేత అత్తూరు తులసేశ్వరరెడ్డికి చెందిన ఫర్నిచర్ షాపును ఎమ్మెల్యే నాని ప్రారంభించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, నాయకులు పులికంటి మోహన్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, ఉమాపతిరెడ్డి, జగన్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మల్లెలవాండ్లపల్లెలో రోడ్డుపైనే వర్షపు నీరు



భాకరాపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ మల్లెల వాండ్లపల్లె వీధులు జలమయమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో డ్రైనేజీ కాలువలను నిర్మించ కుండానే సిమెంటు రోడ్డు వేశారు. ఫలితంగా ఈ పరిస్థితి ఏర్పడింది. ఇళ్లలోకి వర్షపు నీరు వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ కాలువలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

నిండుతున్న చెరువులు



పాకాల వంక ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీఐ మద్దయ్య ఆచారి

పాకాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని చెరువులు 70 శాతానికి పైగా నిండాయి. మద్దినాయనిపల్లె, గానుగపెంట పరిసర ప్రాంతాలలో చెరువులు నిండి మొరవలు పోతున్నాయి. ఫలితంగా పాకాల పెద్దవంక జోరుగా ప్రవహిస్తోంది. పాకాల - దామలచెరువు రోడ్డు, ఊట్లవారి పల్లె రైల్వే అండర్ బ్రిడ్జి కింద పాకాల పెద్దవంక రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ ప్రాంతాన్ని సీఐ మద్దయ్యఆచారి పరిశీలించారు. వాహన దారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

గురుదక్షిణామూర్తికి శాస్త్రోక్తంగా పూజలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురుదక్షిణా మూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక కత్రువులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

దొరవారిసత్రం, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): దొరవారిసత్రంలో గురువారం ఉదయం గంజాయితో రోడ్డుపై నిలిచి ఉన్న ఇద్దరు ఒడిస్సా వాసులను ఎస్ఐ అజయ్‌కుమార్ అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన యాసిన్ మల్లి, శామ్‌సన్‌పాల్ దొరవారిసత్రంలో మండల కార్యాలయ కూడలి వద్ద హైవేపై బస్సు ఎక్కేందుకు వేచి ఉండగా.. వారిపై అనుమానంతో తనిఖీ చేశారు. వారి వద్ద 6.5 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వారి నుండి సేకరించిన సమాచారం మేరకు కేరళ రాష్ట్రంలో ఓ హోటల్‌లో పనిచేసే వీరు గత కొంతకాలంగా ఒడిస్సా నుంచి కేరళకు తక్కువ మోతాదులో గంజాయిని తరలిస్తున్నట్లు తెలిసింది. పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్సీపురంలో కుండపోత

రామచంద్రాపురం, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): మండలంలో రెండు రోజులుగా కుండ పోత వర్షం కురుస్తోంది బుధవారం సాయంత్రం ప్రారంభమైన వర్షం గురువారం ఏక దాటిగా కురిసింది. కమ్మపల్లిలో అమ్మగారి చెరువు కట్ట లీకేజీని, నెన్నూరు కల్వర్టుపై నక్కలవాగు ప్రవాహాన్ని, రాయలచెరువు మొరవను ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులతో కలిసి పరిశీలించారు. ఎక్స కవేటర్‌ను రప్పించి పటిష్ట పరిచే చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఎమ్మెల్యే సూచించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. పెద్దేటి వంక ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇప్పటికే రాయలచెరువు సగం నిండింది. మరో రెండు రోజులు ఇదే వర్షం కురిస్తే రాయల చెరువు నిండే అవకాశం ఉంది. పీవీపురం నుంచి వచ్చే పెద్దేటి వంక నెన్నూరు, కేకేవీ బీపురం కల్వర్టులపై ప్రవహిస్తుండటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఎల్‌ఈ పురం వద్ద మేతకు వెళ్లి తిరిగి వస్తున్న ఓ ఆవు చీకటికోన వాగులో చిక్కుకుని మృతి చెందింది. గంగిరెడ్డిపల్లి వరి, కమ్మకండ్రిగ వద్ద కూర గాయల తోటలు నీట మునిగాయి. ఎమ్మెల్యే వెంట తహసీల్దారు వెంకటరమణ, ఎంపీడీవో ఇందిర, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, జిల్లా నాయకులు జనార్ధనచౌదరి, చిన్నబాబు, సురేష్, సుబ్రహ్మణ్యం యాదవ్ పాల్గొన్నారు.







అమ్మగారి చెరువు లీకేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని, నెత్తకుప్పం వద్ద ఉధృతంగా పెద్దేటి వంక, చీకటికోనవాగులో చిక్కుకుని మృతిచెందిన ఆవు

జల దిగ్బంధంలో జగనన్న కాలనీ



జగనన్న కాలనీలో వరద నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో, అధికారులు

చంద్రగిరి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు తొండవాడ సమీపంలోని జగన్న కాలనీ జల దిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొండవాడ సమీపంలో గత ప్రభుత్వం ప్రజలకు మౌలిక వసతులు కల్పించకుండానే

ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు

ఇంటి స్థలాలు ఇవ్వడంతో ప్రజలు ఇంటి నిర్మాణాలు చేపట్టారు. అయితే వర్షం వస్తే ఆకాలనీ జల దిగ్బంధంలో ఉంటుంది. సమీప గుట్ట ప్రాంతం నుంచి భారీగా కాలనీలోకి వరద నీరు వస్తుంది. దీంతో కాలనీ వాసులు ఇళ్లలో నుంచి బయటకు వచ్చే పరిస్థితిలేదు. విద్యార్థులు స్కూల్‌కి వెళ్లాలన్నా, అత్యవసర సమయంలో బయటకు వెళ్లాలన్నా అవస్థలు పడుతున్నారు. దీనిపై కాలనీ వాసులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం ఎంపీడీవో శేఖర్, ఇరిగేషన్ ఏఈ హేమాద్రి, చంద్రగిరి పంచాయతీ ఈవో మహేశ్వరయ్య, సిబ్బంది జగనన్న కాలనీని పరిశీలించారు. వరద నీరు కాలనీ వైపు రాకుండా చర్యలు చేపడతామని తెలిపారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న కాలనీ ముందు వాగు



వరద నీటిలో కాలనీ వాసులు

ఒకటే వాన..!

తిరుపతిరూరల్, డిసెంబరు12 (ఆంధ్ర జ్యోతి): ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి తిరుపతిరూరల్ మండలంలో జనజీవనం దాదాపుగా స్తంభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రివరకు కూడా ఒకటే జడివాన పట్టుకోవడంతో పలుగ్రామాల్లో ప్రజలు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెల కొంది. గ్రామీణ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారియి. గ్రామీణ ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు వర్షంలో తడుస్తూనే సొంత వాహనాలపై తిరుపతి నగరం లోని విద్యాసంస్థలకు తమపిల్లలను తీసు కొచ్చారు. అయితే అధికారులు కాస్త ఆల స్యంగా సెలవు ప్రకటించడంతో తిరిగి పిల్లలని ఇళ్లకి తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు.

చెరువులు, వాగులు పరిశీలన

మండలంలోని పేరూరు చెరువు, చిగురువాడ, తనపల్లెలోని స్వర్ణముఖినది కాలువ వద్ద తాత్కాలిక వంతెనలు, వంకలను తహసీల్దార్ రామాంజులునాయక్, ఆర్ఎస్‌డీటీ మోహన్,



చిగురువాడ స్వర్ణముఖినది కాలువ తాత్కాలిక వంతెన వద్ద ఎక్స్‌కవేటర్‌తో చేయిస్తున్న పనులు

స్తంభించిన జనజీవనం

వీఆర్వోలతో కలసి పరిశీలించారు. దామినేడు ఇందిరమ్మ గృహాల వద్ద ఉన్న కాలువలో పేరుకుపోయిన చెత్తను ఎక్స్‌వేటర్ సాయంతో ట్రెంచ్‌తీసి తొలగించారు. చెర్లోపల్లె పంచాయతీలో చెరువులో ఇండ్లు, గాంధీపురం పంచాయతీలను వీఆర్వోలు పరిశీలించారు. చిగురువాడ వద్ద స్వర్ణముఖినది కాలువపై ఉన్న తాత్కాలిక వంతెన వదకద నీరు సాఫీగా వెళ్లేలా ఎక్స్‌కవేటర్‌తో పనులు చేపట్టారు. దుర్గసముద్రం టీడీపీ నాయకులు మునిశేఖర్, రవి, శంకర్, కేసీపేటకి చెందిన హరికృష్ణ ఈ పనులను దగ్గరుండి చేపట్టారు. అలాగే చెర్లోపల్లె సర్కిల్ నుంచి జూపార్క్‌కి వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జికింద భారీగా నీరుచేరడంతో వాహనాల రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది.

ఆశ్రయం కల్పించాలంటూ షికారీల నిరసన



వరదయ్యపాళెం, డిసెంబరు 12(ఆంధ్ర జ్యోతి): తమకు ఆశ్రయం కల్పించి భోజ నాలు అందించాలంటూ చిన్నపాం డూరు సమీపంలో షికారీలు గురువారం మధ్యా హ్నం సత్యవేడు వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గంలోని నక్కలమిట్ట వద్ద రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా వాహన రాకపోకలు స్తంభించాయి. దీంతో పరిశ్రమలకు వెళ్లే కార్మికులు ఈ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న శ్రీసిటీ డీఎస్పీ వైడేశ్వరరావు అక్కడికి చేరుకుని షికారీలతో చర్చించి వసతులు కల్పిస్తామని చెప్పడంతో వారు ధర్నా విరమించారు. అనంతరం పోలీసులు రాకపోకలను పునరుద్ధరించారు.

షికారీలకు నచ్చచెబుతున్న పోలీసులు

తిరుమలలో వాన..





అఖిలాండం వద్ద కురుస్తున్న వర్షం, ఆలయం ముందు కానరాని భక్తులు
వర్షానికి ప్రధాన కల్యాణకట్ట వద్దనున్న షెడ్‌లో తలదాచుకున్న యాత్రికులు

శాస్త్రోక్తంగా బాలదీపాల వెలిగింపు

శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం బాల దీపాలను శాస్త్రోక్తంగా వెలిగించారు. యేటా కార్తీక పౌర్ణమిని పుర్కరించుకుని మహానంది వద్ద చుక్కాని ఉత్సవం(భరణి దీపం) వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకకు ఒకరోజు ముందుగా శాస్త్రోక్తంగా బాలదీపాలను వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా గురువారం స్వామి అమ్మవార్ల గర్భాలయాలను శుద్ధి చేశారు. ఆగమ నియమం ప్రకారం అమ్మవారి సన్నిధిలో గురువారం రాత్రి వేదపండితులు ప్రత్యేక పూజలతో హోమ జ్వాల నుంచి ఐదు బాలదీపాలను సంప్రదాయబద్ధంగా వెలిగించారు. అనంతరం బాలదీపాలను వేదపండితులు స్వామివారి సన్నిధిలో కొలువుదీర్చారు. శుక్రవారం సాయంత్రం బాలదీపాలను వేదపండితులు ఊరేగింపుగా చుక్కాని వద్దకు తీసుకెళ్లనున్నారు. అక్కడ బాలదీపాలను ఉంచి ప్రత్యేక పూజల అనంతరం చక్కాణి(భరణిదీపం)ను ప్రజ్వలించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించనున్నారు. గురువారం రాత్రి శుక్రవారం భరణి దీపం వరకు బాలదీపాలు నిరంతరం వెలిగేలా స్వామివారి సన్నిధిలో ఏర్పాటు చేశారు.





ఆలయంలో ఏర్పాటుచేసిన కలశం - ఊరేగింపుగా తీసుకెళుతున్న బాలదీపాలు

నేడు భరణి దీపం...

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి చుక్కాని(భరణి దీపం) వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈ వేడులను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో విచ్చేస్తారు. దీంతో ఇందుకు అవసరమైన తాటిచెట్టు, మట్టలు, పూజాద్రవ్యాలను ఆలయ అధికారులు సిద్ధం చేశారు.

కూరగాయల మార్కెట్





పూలవానిగుంట రోడ్డులో ఓ ఇంటి ఆవరణలో..





కాలువగా మారిన ఎయిర్‌బైపాస్‌రోడ్డు



లక్ష్మీపురం సర్కిల్





శ్రీనివాస కల్యాణ మండపం సమీపంలో





ఎస్జీఎస్ కాలేజి రోడ్డు



పూలవానిగుంట రోడ్డులో



చెరువు కదా మన నగరం

- ఇళ్లలోకి వర్షపునీరు
- ఏరులను తలపిస్తున్న రహదారులు
- స్తంభించిన జనజీవనం



పూలవానిగుంటలో ఇంటి ముందు నిల్చిన నీరు

తిరుపతి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం తిరుపతిని జలది గ్బంధంలోకి నెట్టేసింది. బుధవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరపిలేకుండా ఆకాశానికి చిల్లుపడినట్టు వర్షం కురుస్తూనే ఉండడంతో జన జీవనం స్తంభించిపోయింది. నగరంలోని దాదాపుగా అన్ని ప్రాంతాలూ జలమయమయ్యాయి. అన్ని మార్గాలూ ఏరులను తలపించాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నీటి ప్రవాహంలో ప్రయాణించిన కొన్ని కార్లు, ద్విచక్రవాహనాలు మొరాయించాయి. రోడ్డులోనే నిలిచిపోయాయి. ఇళ్లలోకి వర్షపు నీటితో పాటు డ్రైనేజీ రావడంతో నగరవాసులు నరకం అనుభవిస్తున్నారు. తిరుమల కొండల్లోనూ భారీ వర్షం కురవడంతో కపిలతీర్థం, మాల్వాడి గుండం జలపాతాలు హోరెత్తాయి. డీఆర్ మహల్, వెస్ట్ చర్చి వద్దగల రైల్వేఅండర్ బ్రిడ్జిలు గుంటలను తలపించాయి. ఉదయం 8గంటల నుంచే వెస్ట్ చర్చి రైల్వే అండర్ బ్రిడ్జి కింద రాకపోకలు నిలిపివేశారు. అన్నమయ్య సర్కిల్ నుంచి లక్ష్మీపురం సర్కిల్ అటు నుంచి పద్మావతి పురం వరకు రోడ్డును వరద ముంచెత్తింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చింది.



గొల్లవానిగుంట రోడ్డులో



లీలామహల్ రోడ్డు

● కమిషనర్ పరిశీలన

కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఇతర అధికారులతో కలసి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. వెస్ట్ చర్చి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద గల్వర్ ద్వారా నీటిని తోడాలని సిబ్బందిని ఆదేశించారు. డీఆర్ మహల్ రోడ్డు, కేశవాయనగుంట, నారాయణ పురం ప్రాంతాల్లో పర్యటించారు. కొరమేనుగుంట, గొల్లవాని గుంట ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరద నీరుచేరిన విషయం తెలుసుకుని అక్కడకు వెళ్లారు. అవసరమైతే అక్కడివారిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇబ్బందులు తలెత్తితే 0877-2256766, 9000822909 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని కమిషనర్ కోరారు.

● కల్యాణికి జలకళ

తిరుపతిలోని 19 వార్డులకు నీటిని సరఫరా చేస్తున్న కల్యాణి డ్యామ్‌కు జలకళ వచ్చింది. తిరుపతికి కల్యాణి డ్యామ్, కైలాసగిరి జలాశయాలు ప్రధాన నీటివనరులు. నగరంలో 60 శాతం వరకు తెలుగు గంగ నీటి సరఫరా వుంటుంది. 40 శాతం కల్యాణి డ్యామ్ నుంచే నీరు సరఫరా అవుతుంది. కల్యాణ్‌డ్యామ్ నీటి సామర్థ్యం 910 ఎంసీఎఫ్‌టీలు. ప్రస్తుతం 230 ఎంసీఎఫ్‌టీకి చేరుకుంది. ఎగువప్రాంతాలనుంచి నీరు ఉధృతంగా వస్తుండడంతో శుక్రవారానికి భారీగా నీటినిల్వలు పెరిగే అవకాశం ఉందని మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. రోజుకు 1ఎంసీఎఫ్‌టీ చొప్పున కల్యాణి నీళ్లు వినియోగిస్తారని ఆ లెక్కన 6 నెలలు వరకు పట్టణప్రజలకు నీటికి ఢోకా ఉండదని అంటున్నారు. అంటే రాబోయే వేసవికి సరిపడా నీళ్లు కల్యాణికి చేరినట్టే.



విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడు గణేష్‌ని విధుల్లోకి తీసుకోవాలి

తిరుపతి (జీవకోన), డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డివిజన్ పరిధిలో హైల స్కిల్డ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిగా పనిచేసే గణేష్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో జరిగిన గొడవ విషయంలో గణేష్‌పై పోలీసు కేసు నమోదైంద న్నారు. ఇది కారణంగా చూపుతూ విధుల నుంచి తొలగించడం తగదని పేర్కొన్నారు. కలెక్టర్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఆదేశించినా కాంట్రాక్టర్ అతడిని విధుల్లోకి తీసుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. వెంటనే అతడిని విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి, ట్రాన్స్‌కో డివిజన్ అధ్యక్షులు శరవణ, కలిగిరి డివిజన్ అధ్యక్షులు రెడ్డెప్ప, చిత్తూరు జిల్లా కోశాధికారి రాజు, గణేష్ భార్య వేదవతి పాల్గొన్నారు.

అగ్రి-టెక్నాలజీపై వర్క్‌షాప్



ప్రతినిధులకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రొఫెసర్ మమత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ సెరికల్చర్ విభాగం ఆధ్వర్యంలో అగ్రికల్చర్ టెక్నాలజీపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ ప్రారంభమైంది. ఈ నెల 13వ తేదీ దాకా ఈ కార్యక్రమం జరగనుంది. తిరుపతి చీనీ, నిమ్మ పరిశోధనా కేంద్రానికి చెందిన డాక్టర్ మధుమతి మాట్లాడారు. వ్యవసాయ సాంకేతిక విద్య చదువుకున్న వారికి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. రిసోర్స్ పర్సన్ రమేష్ మాట్లాడుతూ.. తేనెటీగల పెంపకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డీఎం మమత, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా భారత ప్రవచనం ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మహ భారత ప్రవచనం ప్రారంభమైంది. అన్నమాచార్య కళా మందిరంలో ఈ కార్యక్రమాన్ని పది రోజుల పాటు నిర్వహించనున్నారు. తొలి రోజైన గురువారం ఆది పర్వాన్ని గురించి ప్రవచనకర్త జి. రమేష్‌బాబు వివరించారు. రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సురేష్, తిరుమలయ్య, వెంకట్రామయ్య, కోకిల తదితరులు ప్రవచన కర్తను సన్మానించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



గంటా శ్రీనివాసరావు, కంచర్ల శ్రీకాంత్, స్నేహారెడ్డి

తిరుమల, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మాజీ మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీ నటుడు అశోక్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, హీరో అల్లు అర్జున్ సతీమణి స్నేహారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

రుయాకు ఐఓసీ వైద్య పరికరాల వితరణ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చొరవతో రుయాలో రోగుల కోసం దాదాపు రూ.10 లక్షల విలువచేసే వైద్య పరికరాలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు అందించారని సూపరింటెండెంట్ రవి ప్రభు గురువారం తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ, యూరాలజీ, ఆర్థోపెడిక్స్, చిన్నపిల్లల విభాగాల్లో అవసరమైన వైద్య పరికరాల వివరాలను ఇటీవల కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లామని పేర్కొన్నారు. వెంటనే ఆయన ఐఓసీ దృష్టికి తీసుకెళ్లారని వివరించారు. దీంతో వారు పరికరాలు అందించారని తెలియజేశారు. వీటిని ఇప్పటికే ఆయా విభాగాలకు అందజేశామని పేర్కొన్నారు.

ఉరుస్తున్న రుయా

తిరుపతి(వైద్యం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి రుయాస్పత్రిలో పలు భవనాలు ఉరుస్తున్నాయి. ఈఎన్‌టీ, కంటి విభాగం, మహిళల వార్డుల్లోని భవనాలు శ్లాబులు పెచ్చులూడి ఉన్నాయి. అందులో నుంచి నీరు కారుతుండటంతో అక్కడ డబ్బాలను ఏర్పాటు చేశారు. రోగులు, వారి సహాయకులు వార్డులకు, వైద్య పరీక్షలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా వృద్ధులు, వికలాంగులు, చిన్నారులు వర్షానికి చలిగాలులకు అవస్థలు పడ్డారు.





మహిళల వార్డుల్లో దుర్వాసన వెదజల్లుతున్న వ్యర్థాలు, రెండు రోజులుగా వార్డుల ముందు పేరుకుపోయిన బయో వ్యర్థాలు





రుయాస్పత్రిలో జోరుగా పడుతున్న వర్షం, అత్యవసర విభాగం ముందు కుక్కలు తింటున్న బయో వ్యర్థాలు

వ్యర్థాలతో అధ్వానం..

అత్యవసర విభాగం, మెడిసిన్, ట్రయేజ్ వార్డు, ఓపీ విభాగం, చిన్నపిల్లల విభాగాల్లో ఎక్కడ చూసినా బయోవ్యర్థాలు నిండిపోయాయి. అవి వర్షానికి తడిసి దుర్వాసన వెదజల్లాయి. ప్రధానంగా అత్యవసర విభాగం ప్రధాన మార్గం ముందే రెండు రోజులు బయో వ్యర్థాలు అలాగే వదిలేసి ఉండటంతో వాటిని కుక్కలు చెల్లాచెదురుగా చేస్తున్నాయి. వీటి నుంచి వచ్చే దుర్వాసనతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పారిశుధ్యచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కేబీఆర్ నగర్‌కు తేలికపాటి వరద

తిరుపతి అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మంగళంలోని తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని కేబీఆర్ నగర్‌కు వరద ముప్పు పొంచివుంది. గురువారం కురిసిన ఏకధాటి వర్షానికి ఎగువనుంచి వర్షపునీరు ఉధృతంగా ప్రవహించడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వెంకటేశ్వరకాలనీ, రణధీర పురం, సప్తగిరికాలనీ, మంగళం క్వార్టర్స్‌ల ఎగువ అటవీప్రాంతం నుంచి వచ్చేనీటితో పాటు తిరుపతి నుంచి తూర్పుగా ప్రవహించే నీటిప్రవాహంతో చెన్నాయిగుంట చెరువు కలుజు ఉధృతంగా ప్రవహించింది. దిగువనున్న పెద్ద కాలువ పొంగి కేబీఆర్ నగర్‌ను తాకుతూ ప్రవహించింది. అయితే ఇళ్లలోకి నీరు రాకపోవడతో జనం ఊపిరి పీల్చుకున్నారు. అయితే మంగళం క్వార్టర్స్‌లో ఎగువ నుంచి వచ్చే నీటితోపాటు రాళ్లతో కొట్టుకువచ్చి ప్రధానరహదారిపై పేరుకున్నాయి. వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా ముందుజాగ్రత్త చర్యగా పంచాయతీ అధికారులు కేబీఆర్ నగర్, కల్వర్టులను పరిశీలించారు. పారిశుధ్య కార్మికులను నియమించారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేశారు.



కేబీఆర్‌నగర్ కల్వర్టును పరిశీలిస్తున్న కార్యదర్శి

చంద్రగిరి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గురువారం సాయంత్రం కేబీఆర్ నగర్‌లో పర్యటించారు. వర్షానికి సంబంధించి ఇబ్బందులు తలెత్తితే సమాచారం అందిస్తే ఆదుకుంటామని స్థానికులకు భరోసానిచ్చారు.

తిరుపతిలో 17 పునరావాస కేంద్రాలు

తిరుపతి, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని వరద బాధితుల కోసం 17 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ప్రజలను కోరారు.

- పోస్టల్ కాలనీలోని పార్వతీపురం, నగరపాలక సంస్థ పాఠశాల
- మంగళం తుడా క్వార్టర్స్ వద్ద గల ఎంపీపీ స్కూల్
- కొత్తపల్లి, ప్రైమరీ స్కూల్
- కొరమేనుగుంట రాజీవ్ గాంధీ స్కూల్
- ఆర్.ఎస్. ఇంగ్లీష్ మీడియం స్కూల్
- మధురానగర్‌లోని ఎంసీయూపీ స్కూల్
- మధురానగర్‌లోని ప్రియదర్శినిఇంగ్లీష్‌మీడియం స్కూల్
- సంజయ్ గాంధీ కాలనీలోని ఎంయూపీ స్కూల్
-. సత్యనారాయణ పురంలోని జడ్పీ హైస్కూల్.
- కెనడీ నగర్‌లోని డి.అడిక్షన్ సెంటర్
- ఎర్రమిట్టలోని రత్నం, చైతన్య స్కూల్
- సింగాలగుంట మున్సిపల్ స్కూల్
- ఉప్పంగి హరిజనవాడ మున్సిపల్ స్కూల్
- యశోదానగర్‌లోని లిటిల్ ఏంజిల్ స్కూల్
- బైరాగిపట్టెడలోని రామానాయుడు స్కూల్
- ఎల్.బి.నగర్ లోని కేశవరెడ్డి స్కూల్
- వేశాలమ్మ గుడి వీధిలోని ఇందిరా నగర్ స్కూల్

పైన తెలిపిన అన్ని కేంద్రాలకు ఇన్ అధికారులను నియమించామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా హెల్ప్‌లైన్ నంబర్లు 0877-2256766, 900822909ను సంప్రదించాలని కమిషనర్ ఎస్.మౌర్య తెలిపారు.

నడిరోడ్డుపై అయ్యప్ప భక్తులు

- శ్రీవారి దర్శనం ఆలస్యమైందని వెళ్లిపోయిన ప్రైవేటు బస్సు డ్రైవర్
- పోలీసుల చొరవతో నెల్లూరు టోల్‌గేట్ వద్ద ఆగిన బస్సు
- అక్కడికి వెళ్లి ఎక్కిన భక్తులు

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): 35 మంది అయ్యప్ప భక్తులు తిరుమలకు దర్శనం కోసం ఓ ప్రైవేటు బస్సులో తిరుపతికి వచ్చారు. తిరుమలలో వారికి దర్శనం ఆలస్యం కావడంతో డ్రైవర్ భక్తులను ఎక్కించుకోకుండా వెళ్లిపోయాడు. దీంతో భక్తులు రోడ్డున పడాల్సి వచ్చింది. లింక్ బస్టాండు వద్ద భక్తులు గంటల తరబడి వారి బస్సు కోసం ఎదురుచూశారు. ఫలితం లేకపోవడంతో 100కు కాల్ చేశారు. అలిపిరి పోలీసులు వెంటనే తిరుపతి నుంచి నెల్లూరు, కడప జిల్లాల పోలీసులను, టోల్ గేట్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆ ప్రైవేటు బస్సు నెల్లూరు వైపు వెళుతుందని గుర్తించారు. నెల్లూరు టోల్‌గేట్ వద్ద బస్సును ఆపించారు. అయితే తిరుపతికి వచ్చేది లేదని భక్తులనే ఇక్కడికి రావాలని డ్రైవర్ మొండికేశాడు. ఇక చేసేదేమీలేక భక్తులు వేరే బస్సులో అక్కడికి వెళ్లి వారి బస్సులోనే స్వస్థలాలకు వెళ్లారు.



అయ్యప్ప స్వాములను వదలిపెట్టి వెళ్ళిన బస్సు

పాస్‌బుక్‌లు మంజూరు చేయండి

తిరుపతిరూరల్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): తమ భూములకు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని కేసీపేటకు చెందిన పలువురు రైతులు రెవెన్యూ అధికారులకు విన్నతించారు. తిరుపతిరూరల్ మండలం కేసీపేట గ్రామపంచాయతీలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్ రామాంజులు నాయక్‌కు వినతిపత్రాలు అందజేశారు.గ్రామపరిధిలో దాదాపు 295 ఎకరాలకు పాసుపుస్తకాలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. మండల సర్వేయర్ హేమకుమార్, వీఆర్వో కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



వానలోనే చక్రతీర్థ ముక్కోటి

తిరుమలలో జోరున కురుస్తున్న వానలోనే గురువారం చక్రతీర్థ ముక్కోటి జరిగింది. కార్తీక సమయంలో దీన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం వానలోనే మంగళవాయిద్యాల నడుమ ఆలయం నుంచి చక్రతీర్థానికి ఊరేగింపుగా వెళ్లారు. అక్కడ చక్రత్తాళ్వారుకు, నరసింహ స్వామికి, ఆంజనేయస్వామికి అభిషేకం, పుష్పాలంకారం చేపట్టి హారతి ఇచ్చారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి



హ్యాపీ బర్త్‌డే రజనీకాంత్

ప్రసిద్ధ నటి రాధిక తిరుమల నుంచి శుక్రవారం పుట్టిన రోజు జరుపుకుంటున్న రజనీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో రాధిక దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ రజనీకాంత్ ఆరోగ్యంతో ఉండాలని స్వామి సన్నిధి నుంచి కోరుకుంటున్నానన్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

దర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.88 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,887
తలనీలాలు సమర్పించినవారు: 25,725



గోగర్భం డ్యాం నుంచి విడుదల చేసిన నీరు

తిరుమలలో దంచికొట్టిన వాన


నిండిన జలాశయాలు

తిరుమలలో వాన ముంచిపోసింది. గురువారం వేకువజామున జల్లులతో మొదలైన అర్ధరాత్రి వరకు ఏకధాటిగా కురిసింది. శ్రీవారి ఆలయం ముందు, మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద భవనం, వైకుంఠం క్యూకాంప్లెక్స్ ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. లోతట్టుప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. దర్శనానికి వెళ్లేవారూ, బయటకు వచ్చేవారూ కూడా తడిచి ముద్దయ్యారు. గదులు లభించని భక్తులు యాత్రికుల వసతి సముదాయాలు, షెడ్లు, కార్యాలయాల ముందే చలికి ముడుచుకుని ఉండిపోయారు. వాన కారణంగా సాయంత్రం ఆలయం ముందు నిర్వహించే సహస్రదీపాలంకరణసేవను వైభవోత్సవ మండపంలో నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డ్యాములు	సామర్థ్యం	ప్రస్తుతం
పాపవినాశనం	5,240 (లక్షల గ్యాలన్లు)	నిండిపోయి గేట్లు ఎత్తివేత
కుమారధార	4,258	4,005
పసుపుధార	1,287	1,100
గోగర్భం	2,833	నిండిపోయి గేట్లు ఎత్తివేత
ఆకాశగంగ	685	నిండిపోయి ఓవర్‌ఫ్లో అవుతోంది





ఆకాశగంగ గేట్లు ఎత్తిన దృశ్యం - నిండుకుండలా ఆకాశగంగ

నిండిన జలాశయాలు : తిరుమలలోని గోగర్భం, ఆకాశగంగ, పాపవినాశనం డ్యాములు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. పాపవినాశనం, గోగర్భం డ్యాముల గేట్లును ఎత్తివేయగా, ఆకాశగంగా డ్యాం నుంచి నీరు ఓవర్‌ఫ్లో అవుతోంది. కుమారధార, పసుపుధార డ్యాముల్లోకి 90 శాతం నీరు చేరింది. శుక్రవారం వేకువజాముకు ఇవి కూడా నిండిపోతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత నిల్వలతో రానున్న 350 రోజులకు తిరుమల అవసరాలకు సరిపడా నీరు అందుబాటులోకి వచ్చింది. తిరుమల అవసరాలకు ప్రతిరోజు 50 లక్షల గ్యాలన్ల నీరు అవసరం. ఇందులో 20 లక్షల గ్యాలన్లు తిరుమల డ్యాముల నుంచి మరో 30 లక్షల గ్యాలన్లు కల్యాణిడ్యాం నుంచి తీసుకుంటారు. గత మూడు నెల క్రితం వరకు కూడా తిరుమలలో నీటి ఇబ్బందులు వస్తాయని టీటీడీ అధికారులు ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంలో నీటి వినియోగంలో కొన్ని ఆంక్షలు కూడా విధించారు. అయితే తాజా వానలతో జలాశయాల్లోకి నీరునిండుగా చేరడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

పాపవినాశనం, శ్రీవారిపాదాలకు నో ఎంట్రీ

ముందస్తు జాగ్రత్తగా తిరుమలలో సందర్శనీయ ప్రదేశాలైన పాపవినాశనం, జపాలి, వేణుగోపాలస్వామి ఆలయం, ఆకాశగంగ, శ్రీవారిపాదాలు, శిలాతోరణం మార్గాలను టీటీడీ గురువారం ఉదయం మూసివేసింది. అలిపిరి, శ్రీవారిమెట్టు కాలినడక మార్గాలలో భక్తులు జాగ్రత్తగా వెళ్లాలంటూ విజిలెన్స్ సిబ్బంది సూచనలు చేస్తున్నారు.



రెండో ఘాట్‌లో జారిన బండ

రెండవ ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. మార్గంలోని హరిణి విశ్రాంతి షెడ్‌కు సమీపంలో ఓ భారీ బండరాయితో పాటు మట్టి, చిన్నపాటి రాళ్లు రోడ్డుమీదకు జారాయి. ఆ సమయంలో వాహనాలేవీ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్, ఇంజినీరింగ్ అధికారులు జారిన కొండచరియలను వేగంగా తొలగించారు. రెండు ఘాట్ రోడ్లలోనూ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలను మూడు బృందాలు పరవేక్షిస్తున్నాయి.



లీలామహల్ వద్ద భారీ వర్షాలతో ప్రజలకు అవసరమైన సూచనలు ఇస్తున్న డీఎస్పీ

వాగులు..వంకల వద్ద పోలీసు పహారా : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఎవ్వరూ అనవసరంగా బయటకు రావద్దని, వాగులు, వంకల్లో చిక్కుకుని ఇబ్బందులు పడవద్దని ఎస్పీ సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం డయల్ 112 లేకుంటే 8099999977కు వాట్సాప్‌కు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. అండర్ బ్రిడ్జిల కింద నిర్లక్ష్యంగా వెళ్లరాదన్నారు. తిరుపతిలో దాదాపు 12 ప్రాంతాలు జలమయమయ్యాయని, పోలీసులు దగ్గరుండి పరిస్థితులను సమీక్షిస్తున్నారని తెలిపారు. కాలువలు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించే చోట ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ఆస్థి, ప్రాణనష్టం సంభవించకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

కాళంగి 10 గేట్లు ఎత్తివేత

కేవీబీపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు కాళంగి జలాశయం నిండుతోంది. జలాశయం సామర్థ్యం 240 అడుగులు కాగా ప్రస్తుతానికి 225 అడుగులు చేరింది దీంతో పది గేట్లను 8 అడుగుల చొప్పున ఎత్తి నీటిని దిగువకు వదిలినట్లు ఏఈ బాబు తెలిపారు. జలాశయంలోకి 9,200 క్యూసెక్కుల నీరు చేరుతుండగా గేట్ల ద్వారా 10,080 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతానికి ప్రధాన గేట్ల వద్ద 198 ఎంసీఎఫ్‌టీల నీరు నిల్వ ఉందన్నారు. ఇంకా పెరిగే అవకాశముంటే మరిన్ని గేట్లు ఎత్తుతామని వివరించారు.

కొట్టుకుపోయిన వంతెన

కేవీబీపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజులకండ్రిగ సమీపంలో పూడి గ్రామాలకు వెళ్లే మట్టి వంతెన వర్షాలకు కొట్టుకుపోయింది. విద్యార్థులు ప్రవాహం తక్కువగా ఉన్న సమయంలో కేవీబీపురంలోని ఆదర్శ పాఠశాలకు, రాజులకండ్రిగలోని ప్రాథమిక పాఠశాలకు చేరుకున్నారు. అయితే అధికారులు స్కూళ్లకు ఆలస్యంగా సెలవు ప్రకటించడంతో విద్యార్థులు వర్షంలోనే తిరుగు ప్రయాణం కావాల్సి వచ్చింది. ఆ సమయంలో ఏరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో స్థానిక యువకులు వారిని దగ్గరుండి ఏరు దాటించారు. ఇది గమనించిన సర్పంచు, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎవరూ ఏరు దాటకుండా సిబ్బందిని కాపలా పెట్టారు.

ఆలస్యంగా సెలవు ప్రకటన

ఇబ్బందిపడ్డ విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు

తిరుపతి(విద్య), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉన్నతాధికారుల ఉదాసీనత కారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. తుఫాన్ కారణంగా ఈనెల 11వ తేదీ నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నా జిల్లా విద్యాశాఖాధికారులు పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించలేదు. దీంతో తల్లిదండ్రులు విద్యార్థులను వర్షంలో తడుస్తూనే విద్యాసంస్థలకు తీసుకెళ్లారు. తీరా అక్కడికి చేరుకున్నాక విద్యాశాఖాధికారులు సెలవు ప్రకటించారు. దీంతో తల్లిదండ్రులు మళ్లీ విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు.

43 ఆర్టీసీ బస్సుల రద్దు



సీబీఎస్‌లో తూములో పూడిక తొలగిస్తున్న అధికారులు

తిరుపతి (ఆర్టీసీ), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 12 మార్గాల్లో ఆర్టీసీ రవాణా స్తంభించింది. వర్షానికి ఏరులు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించడం, వంతెనలు, రోడ్లు కొట్టుకుపోవడంతో 43 బస్సులను నిలిపివేశారు. తిరుమల ఘాట్ బస్సుల్లోనూ తక్కువ సంఖ్యలోనే ప్రయాణికులు కనిపించారు. సీబీఎస్‌లో నీరు పేరుకుపోవడంతో తూముల్లో పూడికతీసి బయటకు పంపే ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ రవాణా ఆగిన మార్గాలు.. బస్సులు : తిరుమల పాపవినాశనం 8, సీతకాలువ 1, ఉడమలపాడు 2, అమ్మపల్లి డ్యామ్ 1, అడవికండ్రిగచెరువు 1, కావనూరు ఏరు 1, కలవకూరుకాలువ 2, గోవర్ధనపురం 9, నారాయణవనం 12, పేర్నాడు 1, పున్నేపల్లి 1, బోయలగడ్డ 4 బస్సులు డిపోలకు పరిమితమయ్యాయి.

దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తీసుకెళ్లాలి

- ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ
- ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే
- కోడింగ్‌లో గెలుపొందిన జట్లకు నగదు బహుమతి అందజేత







సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ - విజేతలకు చెక్కు అందిస్తున్న ఐఐటీ అధికారులు - విద్యార్థుల సంబరాలు

ఏర్పేడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకురావడానికి దేశం సిద్ధంగా ఉందని, ఇండియా ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తీసుకెళ్లడానికి విద్యార్థులు కృషి చేయాలని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ సూచించారు. ఐఐటీ తిరుపతిలో జరిగిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024 ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఇండియా ఆవిష్కరణలు దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటే విధంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమం అద్భుతమైన విజయం సాధించిందని ముఖ్య అతిథి స్విమ్స్ వైస్ చాన్సలర్ ఆర్వీ కుమార్ అన్నారు. ఏఐసీటీఈ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్‌కుమార్ గుంజు మాట్లాడుతూ విద్యా మంత్రిత్వ శాఖ గుర్తించిన 51 మోడల్ కేంద్రాల్లో తిరుపతి ఐఐటీ చేరడం గర్వకారణంగా ఉందని చెప్పారు. తిరుపతి ఐఐటీలో డిసెంబరు 11 నుంచి 12 వరకు రెండు రోజుల పాటు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలే జరిగింది. ఆయుష్ మంత్రిత్వ శాఖ అందించిన వాస్తవ-ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి దేశంలోని వివిధ ప్రతిష్ఠాత్మక కళాశాలల నుంచి 21 బృందాలు పాల్గొన్నాయి. బుధవారం ఉదయం 9.30 నుంచి గురువారం సాయంత్రం 5.30 గంటలు 36 గంటల పాటు నిరంతరాయంగా పోటీ జరిగింది.

కోడింగ్ విజేతలు వీరే..

ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆయుర్వేదం, యోగ, నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతిలో ఉపయోగించే విభిన్న శ్రేణి ఔషధ మొక్కలను ప్రదర్శిస్తూ వినియోగదారులకు ఇంటరాక్టివ్ ఎడ్యుకేషన్, లీనమయ్యే అనుభవాన్ని అందించే వర్చువల్ హెర్బల్ గార్డెన్‌ను సృష్టించాలని విద్యార్థుల బృందాలకు సూచించింది. ఆయుష్ రంగంలో స్టార్టప్‌ల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి రిజిస్ట్రేషన్ పోర్టల్ సామర్థ్యం పారదర్శకతను మెరుగుపరచడానికి అవసరమైన ప్రణాళికలను కోడింగ్ చేయాలని విద్యార్థులకు సూచించింది. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన స్టాక్ స్క్వాడ్ విద్యార్థుల బృందం, ఆర్ఎంకే ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ప్రగతి మిత్ర గ్రూప్‌నకు చెందిన విద్యార్థుల బృందం, కోడ్ క్రాఫ్ట్ విద్యార్థుల బృందం విజేతలుగా నిలిచాయి. పుణేకు చెందిన ఆర్మీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన కార్బన్ డేటర్స్ విద్యార్థుల బృందం, మహారాష్ట్రకు చెందిన కేకే వాగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థుల బృందం సంయుక్తంగా విజేతలుగా నిలిచారు.

కల్కి ఆశ్రమం నుంచి మా భూములు అప్పగించండి!

- హైకోర్టును ఆశ్రయించిన రైతులు

వరదయ్యపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాలెం మండలంలోని కల్కి ఆశ్రమం స్వాధీనంలో ఉన్న తమ భూములను అప్పగించాలంటూ పలువురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. వరదయ్యపాలెం మండలం చెదుళ్లపాకం రెవిన్యూ గ్రామ పరిధిలో పులి పోలయ్య, చంద్రశేఖర్, నీలమ్మ, సలవాది రాము అనే వారికి గతంలో ప్రభుత్వం ఆరు ఎకరాల సీలింగ్ భూములను కేటాయించింది.వాటికి అసైన్‌మెంట్ పట్టాలు జారీ చేసింది. అయితే 2008లో వీరు హైకోర్టును ఆశ్రయించి ప్రభుత్వం తమకు కేటాయించిన అసైన్‌మెంట్ భూములను కల్కి ఆశ్రమ నిర్వాహకులు ఆక్రమించుకుని ఆశ్రమంలో కలిపేసుకున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.తమ భూముల్ని తమకు అప్పగించాలని కోరారు. అయితే పిటిషనర్ల తరపు ఎవరూ కోర్టులో వాదించకపోవడంతో సుదీర్ఘకాలం వేచి చూసిన హైకోర్టు ఈ ఏడాది జనవరిలో ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. 2008లో తాము దాఖలు చేసిన కేసును నడిపించే ఆర్థిక స్థోమత తమకు లేకపోయిందని, అందువల్ల కేసు నడపలేకపోయామని తాజాగా మరోసారి పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారించి తమ భూములను తిరిగి ఇప్పించాలని వారు తాజాగా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో హైకోర్టును కోరారు. రిట్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు నాలుగు వారాలకు కేసును వాయిదా వేసింది.

తిరుపతి-మదనపల్లె రోడ్డు విస్తరణ పూర్తి చేయండి

- కలెక్టర్‌కు సీఎం సూచన



సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అనుమతులు తీసుకుని తిరుపతి-మదనపల్లె రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. రేణిగుంట-కడప రోడ్డును కూడా పూర్తి చేయాలన్నారు. శ్రీకాళహస్తి-నడికుడి రైల్వే ప్రాజెక్టు భూసేకరణ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. వనరులను సద్వినియోగం చేసుకుని జిల్లాను బాగా అభివృద్ధి చేయాలని సూచించారు. విజయవాడలో రెండు రోజులుగా జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో గురువారం సీఎం పలు అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. జిల్లాలో పరిశ్రమలను నెలకొల్పడంలో భూసేకరణలో రైతులను భాగస్వామ్యం చేయాలన్నారు. తిరుపతిలో ఎలక్ట్రానిక్ తయారీ క్లస్టర్‌కు 500 ఎకరాల స్థలం వెచ్చించాలని సూచించారు. తిరుపతి నగర పరిధిలో ఐటీ పార్క్‌కు 50 ఎకరాల స్థలం కావాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో కొంతమంది ఫేక్ సర్టిఫికెట్లు పొంది పింఛన్లు తీసుకుంటున్నారని, అలాంటి ఆస్పత్రులపై చర్యలు తీసుకునేందుకు మెడికల్ బోర్డు మార్గదర్శకాలు సవరించాలని కోరారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భూ ఆక్రమణలపై సీఎం ఆరా తీశారు. 22ఏ అసైన్‌మెంట్‌ల్యాండ్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టపెట్టడంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్రాంతికి జిల్లాలో గుంతల్లేని రహదారులు ఉండాలని, ఇచ్చిన నిధులతో సాధ్యమైనంత త్వరగా రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించాలని అన్నారు. సారా, గంజాయి, అక్రమ మద్యంపైనా దృష్టి సారించాలని ఎస్పీ సుబ్బరాయుడుకు సీఎం సూచించారు.



నుజ్జునుజ్జయిన కార్లు

రోడ్డు ప్రమాదంలో పదిమందికి గాయాలు



చంద్రగిరి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిలోని తొండవాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 10 మంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. హైదరాబాదుకు చెందిన సీహెచ్ గిరిధర్ తన కుటుంబ సభ్యులతో కాణిపాకంలో వినాయకస్వామిని దర్శించుకుని కారులో తిరుపతికి బయలుదేరారు. మండలంలోని ముంగిలిపట్టుకు తిరుమలేష్, అతని స్నేహితులు తిరుపతికి చెందిన హేమంత్, లిఖిత్ కుమార్, గౌరీశంకర్, చరణ్‌కుమార్ కారులో తిరుపతి నుంచి చిత్తూరు వైపు అతివేగంగా వెళుతున్నారు. తొండవాడ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొడుతూ ఎదురుగా వాహనాలు వచ్చే రోడ్డులోకి దూసుకెళ్లింది. ఆ క్రమంలో గిరిధర్ వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. సీహెచ్ గిరిధర్, కాత్యాయని, వాణి, కేవీఎస్ ప్రసాద్, డ్రైవర్ వెంకటేష్‌రెడ్డిలకు గాయాలయ్యాయి. అదేవిధంగా ఢీకొన్న కారులోని ఐదుగురు స్నేహితులకూ గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వేలో మజ్దూర్ యూనియన్‌కు, సంఘ్‌కు గుర్తింపు

తిరుపతి(సెంట్రల్)డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): రైల్వేలో ప్రతిష్టాత్మకంగా జరిగిన ఉద్యోగ సంఘాల గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వేలో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌లకు గుర్తింపు లభించింది. దేశవ్యాప్తంగా ఈనెల 4, 5, 6, తేదీల్లో రైల్వేలో పోలింగ్ జరిగింది. గురువారం లెక్కింపు చేశారు. దక్షిణ మధ్య రైల్వేలో 78,434 ఓట్లు పోలయ్యాయి. ఇందులో మజ్దూర్ యూనియన్ 32,371ఓట్లతో 47.46 శాతం, ఎంప్లాయిస్ సంఘ్ 29,266 ఓట్లతో 42.91 శాతం సాధించి అర్హత సాధించాయి. మిగిలిన డీఎంఆర్‌కేఎస్ 5,634 ఓట్లతో 8.26 శాతం, ఐఆర్ఎంయూ 286 ఓట్లతో 0.42శాతం, ఆర్ఎంయూ 654 ఓట్లతో 0.96 శాతం సాధించాయి. దీంతో ఈ మూడు సంఘాలను పరిగణనలోకి తీసుకోలేదు. గుంతకల్లు డివిజన్‌లో ఎంప్లాయిస్ సంఘ్ 243 ఓట్లతో పైచేయి సాధించింది. దీనిపై సంఘ్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తిరుమలలో అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలి

- విజయశంకర్‌స్వామి -



మాట్లాడుతున్న అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి

తిరుపతి (జీవకోన), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల మాడవీధుల విస్తరణలో భాగంగా కూల్చివేసిన అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, లేనిపక్షంలో ఫిబ్రవరి 22న ఆమరణ నిరాహార దీక్షకు దిగుతామని మంగళం అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి స్పష్టం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య ఇంటిని తిరిగి నిర్మించాలని, తొలగించిన హనుమంతుడి విగ్రహాన్ని యథాస్థానంలో ప్రతిష్ఠించాలని కోరుతూ పుణ్యక్షేత్రాలు తిరిగి భక్తుల సంతకాలు సేకరించి టీటీడీకి సమర్పించామన్నారు. అన్నమయ్య గృహ సాధన సమితి, జై భారత్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ డిమాండ్లపై పోరాడుతున్నామన్నారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో నిత్య హరినామ సంకీర్తన జరగాలని, అప్పుడే పూర్తిస్థాయిలో తిరుమల పుణ్యక్షేత్రం ప్రక్షాళన అవుతుందన్నారు. భక్తి గీతాలు నేర్పించే గురువులకు టీటీడీ గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసియోధ లోకనాథ్, ఖదిజ్ఞాసి మల్లికావల్లభ, ఖధిజ్ఞాసి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పశువైద్య విజ్ఞానాన్ని రైతులందరికి చేర్చాలి

వెటర్నరీలో ముగిసిన జాతీయ సదస్సు



అవార్డులు అందిస్తున్న ఇన్‌చార్జి వీసీ జేవీరమణ, డీన్ వీరబ్రహ్మయ్య, ఏడీ జగపతి రామయ్య

తిరుపతిరూరల్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ఆధునిక పశువైద్య విజ్ఞానాన్ని గ్రామీణ స్థాయిలో రైతులదరికీ అందించి వారి అభివృద్ధికి తోడ్పాటు నందించాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీ రమణ యువపరిశోధకులకు సూచించారు. వెటర్నరీ కళాశాల వేదికగా పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు పశువుల ఆరోగ్యం, ఉత్పత్తి అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పశు వులకు సంబంధించిన పలురకాల వ్యాధులు, వాటి నియంత్రణకు వినియోగించే మందులు, వ్యాధి నిర్ధారణ సాంకేతికత, ఆధునిక యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, పశుసంపద పెంపునకు కృషిచేయాలని ఆకాంక్షించారు. వెటర్నరీడీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రతిఏటా వర్సిటీలో జాతీయస్థాయి సదస్సుని నిర్వహించి, దేశంలోని పశువైద్యవిద్య పరిశోధకులని గుర్తించి వారిని ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఉత్తమ పరిశోధనా పత్రాలు సమర్పించిన వారికి అవార్డులను ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ, కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ పి.జగపతిరామయ్య, కో-ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ సుధీర్, డాక్టర్ మురళి, డాక్టర్ చైతన్యకుమార్, డాక్టర్ రాజా పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వాయిదా వేయండి: సీపీఎం

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుపాను వల్ల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రెవెన్యూ సదస్సులు వాయిదా వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజ జేసీ శుభం బన్సాల్‌ను కోరారు. చాలా ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయని, గతంలో నిండిపోయిన చెరువులు గండ్లు పడే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. తుపాను సహాయక చర్యల నేపథ్యంలో సదస్సులు వాయిదా వేయాలని విన్నవించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

కుండపోత వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం..!

● ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు ● పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు ● నీట మునిగిన పంటలు ● కన్నీరు పెడుతున్న రైతన్నలు


దొరవారిసత్రం: తనియాలి వద్ద వంతెనపై వరద నీరు


వరద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

చిట్టమూరు: మండలంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో వరినాట్లు నీట మునిగాయి. తాడిమేడు, కోగిలి, వడ్డికండ్రిగ ప్రాంతాల్లోని కలుజులపైన నీటి ప్రవాహం రావడంతో ఈ మార్గంలో కంప అడ్డుగా వేశారు. రొయ్యల కాలువ, బాలచంద్రారెడ్డి ఎస్టేట్ వద్ద అధికారులు పర్యటించి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రజలు నీటి ప్రవాహ ప్రాంతాలకు వెళ్లరాదని తహశీల్దారు ప్రసాద్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్సై చిన్న బలరామయ్య హెచ్చరించారు.

పెళ్లకూరు: మండలంలో కురుస్తున్న వర్షాలకు స్వర్ణముఖితోపాటు చెరువులు, వాగులు, వంకలు, కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకే వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం మళ్లీ మొదలైన వర్షాలతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఓ వైపు స్వర్ణముఖి మరో వైపు పాలచ్చూరు కాలువలు, వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా మండలంలోని కలవకూరు వద్ద ఉన్న చెక్‌డ్యామ్‌కు వరద పోటెత్తింది. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ సమాచారం మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు ద్వారకనాథ్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన కలవకూరు స్వర్ణముఖినదిపై ఉన్న చెక్‌డ్యామ్, కప్పగుంటకండ్రిగ లోలెవల్ కాజ్‌వేపై వస్తున్న వరద ప్రవాహాన్ని పరిశీలించారు. కలవకూరు చెక్‌డ్యాంపై నుంచి రాకపోకలు సాగించే వెంకటగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజల రాకపోకలు స్తంభించాయి. వర్షాలు పూర్తిగా తగ్గే వరకు చెక్‌డ్యామ్, లోలెవల్ కాజ్‌వేల మీదుగా రాకపోకలు సాగించొద్దని సూచించారు. మండలంలోని పలు చెరువులు ప్రమాదకరంగా మారాయి.

సూళ్లూరుపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సూళ్లూరుపేటలో గురువారం తెల్లవారు జామున నుంచి కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి వీడని భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. ఎగువన కాళంగి రిజర్వాయర్ గేటు ఎత్తివేయడంతో కాళంగి నదికి భారీగా వరదనీరు చేరింది. వర్షం ఇలాగే కొనసాగితే పట్టణానికి వరదముప్పు పొంచి ఉంది. ఎలాంటి నష్టం జరగకుండా ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

డక్కిలి: తుఫాన్ ప్రభావంతో గురువారం రోజంతా ఉరవడంతో చెరువులన్నీ పూర్తిగా నిండిపోయాయి. వెలుగొండ కొండల్లో పడ్డ వర్షపు నీరు సప్లైఛానల్ నుంచి చెరువుల్లోకి వచ్చి చేరుతోంది. పలు పంట కాలువలు తెగిపోవడంతో కొండల్లో నుంచి వచ్చే వర్షపు నీటి ప్రవాహం పంట పొలాల వైపు మళ్లడంతో నాగవోలు, మిట్టపాళెం, లింగసముద్రం గ్రామాల్లో వరి నాట్లు నీట మునిగాయని రైతులు తెలిపారు. మోపూరు పంట కాలువకు గండి పడటంతో నీరంతా వృథాగా పోతోంది.

మండలంలో ఎలాంటి ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకోకుండా తహశీల్దారు శ్రీనివాసులు చర్యలు తీసుకుంటున్నారు.

బాలాయపల్లి: మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షంతో కైవల్యానది ఉప్పొంగడంతో మండలంలోని కడగుంట, రామాపురం, నిండలి, వాక్యం, డక్కిలి మండలంలోని దగ్గవోలుతో పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మధ్యాహ్నం వరకు నీటి ఉధృతి లేకపోవడంతో ప్రజలు కష్టంపై రాకపోకలు సాగించారు.

గూడూరు: గూడూరు పట్టణంలో రోడ్లన్నీ నీటితో నిండిపోయాయి. దీంతో పాదాచారులు పలు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామీణ ప్రాంతాల రోడ్లు బురదమయంగా మారాయి. అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు, అంగన్‌వాడీ బడులకు అధికారులు సెలవు ప్రకటించడంతో విద్యార్థులు ఇళ్లకు వెనుదిరిగారు. రెవెన్యూ సదస్సులకు గురువారం ఆటంకం కలిగింది. గూడూరు రూరల్ కందలిలో ఉదయం రెవెన్యూ సదస్సు ప్రారంభం కాగా.. మధ్యాహ్నం కుందకూరులో జరగాల్సిన కార్యక్రమం వర్షం కారణంగా రద్దు చేశారు. కోట మండలం కేశవరంలో సదస్సు రద్దయింది. మిగిలిన చోట్ల వర్షంలో అవస్థలు పడుతూనే అధికారులు సదస్సులు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: కౌవల్యా నదిలో వరద ప్రవాహం మూడు అడుగులకు చేరడంతో ఎస్‌ఐ సుబ్బారావు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో రాకపోకలు నిలిచిపోయారు. మండలంలోని అన్ని చెరువుల్లో వరద నీరు భారీగా చేరాయి. వరి మడులు పూర్తిగా మునిగిపోయాయి.

దొరవారిసత్రం: మండలంలో గురువారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఎడతెరిపిలేని వర్షాలు కురిశాయి. మండల పరిధిలో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. నెర్రికాలువ, పాలకాలువ, కన్నాకాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి గురువారం దొరవారిసత్రం మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో పరిశీలించారు. తహశీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఎస్‌ఐ అజయ్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోట: మండలంలో కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. మండలంలోని రాజుపాళెం, గూడలి, దక్షిణపాలెం, గోవిందపల్లి, రంగన్నగుంట, వెంకన్నపాళెం గ్రామాల్లోని వరిపైర్లు నీటమునిగాయి.

వాకాడు: వర్షాలకు స్వర్ణముఖి బ్యారేజీకి గురువారం 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుకోవడంతో నిండుకుండను తలపిస్తుంది. స్వర్ణముఖి బ్యారేజీ నిల్వ సామర్థ్యం 0.0035 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 10 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం రావడంతో 5 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామని ఇరిగేషన్ ఏఈ కృష్ణయ్య తెలిపారు.

వాకాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తూపిలిపాళెం సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్ర తీరప్రాంతాల గ్రామాల్లో తీవ్రమైన చలిగాలులతోపాటు తీరప్రాంత వాసులను భయాందోళనకు గురిచేసింది. మత్స్యకారులు సముద్రవేటకు వెళ్లకుండా తహశీల్దారు రామయ్య చర్యలు చేపట్టారు.

వెంకటగిరి: వెంకటగిరిలో కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. వీర్నాదిపేట, మల్లమ్మగుంట, ఎన్టీఆర్ కాలనీ, కాపాంకెం, అరవపాళెం, బంగారుపేట ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. పలు ప్రాంతాల్లో వర్షాలకు మగ్గం గుంటల్లోకి నీరు చేరడంతో చేనేత మగ్గాలు నిలిచి పోయాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం శాసన సభ్యులు కురుగొండ్ల రామకృష్ణ పట్టణంలో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. టీడీపీ నేతలు పులికల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరరావు, శ్రీనివాసులు నాయుడు ఉన్నారు.


పెళ్లకూరు: చెంబాయితోపు వద్ద నీటమునిగిన వరి


గండిపడిన మోపూరు పంట కాలువ


కోట: దక్షిణ పాలెం వద్ద నీటమునిగిన వరి


లోతట్టు ప్రాంతాల నుంచి వృద్ధ మహిళను సురక్షిత ప్రాంతానికి తీసుకెళుతున్న స్థానికులు


వరద నీటిని పరిశీలిస్తున్న తహశీల్దారు శ్రీనివాసులు


పుదూరులో నీటమునిగిన వరిపైరు


జలమయమైన అగ్రహారపేట రోడ్డు


పెళ్లకూరులో నీటమునిగిన వరి


ఉధృతంగా ప్రవహిస్తున్న కాళంగి నది


మున్సిపల్ అధికారులతో ను ఆదేశిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

నాయుడుపేట/టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం తెల్లవారుజాము నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. పట్టణంలోని గెరిడీవీధి, అగ్రహారపేట వీధి, విశ్వభారతి పాఠశాల వీధి, పాత వెంకటగిరి రోడ్లన్నీ జలమయం కావడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడ్డారు. పంటపొలాలు నీటమునిగాయి. చెరువులన్నీ నిండిపో యాయి. దీంతో ఇన్‌చార్జి తహశీల్దారు రాజేంద్ర, స్వర్ణముఖినది, మామిడికాలువ, ప్రధాన చెరువులను పరిశీలించి మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేశారు.

తడ: ఎడతెరిపి లేని వర్షంతో తడ మండలంలో పలు వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. చెన్నై-కోల్‌కత్తా రహదారిపై సుజాత నగర్ వద్ద భారీగా వర్షపునీరు పారడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు చేరుకుని చర్యలు చేపట్టారు. వర్షంతో చెరువులు నిండుకుండలా మారాయి. గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, పంటపొలాలు నీటమునిగాయి.

పుత్తూరు వార్తలు

వర్షం... స్తంభించిన జనజీవనం

● అప్రమత్తంగా వ్యవహరించిన మున్సిపల్ అధికారులు



ఉధృతంగా ప్రవహిస్తున్న పిల్లారిపట్టు వాగు

పుత్తూరు అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పట్టణంలోని కాలువలు పొంగిపొర్లాయి. రహదారులు జలమయమయ్యాయి. పట్టణ పరిధిలోని మూడు రైల్వే అండర్ బ్రిడ్జీల కింద నీరు చేరి రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు అత్యవసమైతే తప్ప బయటకు రావద్దని అధికారుల సూచనలు చేశారు. బీడీ కాలనీ, కేకేఆర్‌కే పురం, భవానీనగర్ ప్రాంతాల సమీపంలో వాగులు పొంగి రహదారులపై ప్రవహించారు. ఈ ప్రాంతంలో వాహన రాకపోకలను నియంత్రిస్తూ అధికారులు బ్యారీ కేడ్లు ఏర్పాటు చేశారు. పిల్లారిపట్టు, నేసనూరు ప్రాంతంలో మూలకోన నుంచి వచ్చే నీటితో సమీప ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇక కాలువల్లో నీటి ప్రవాహానికి చెత్త అడ్డుపడటంతో మున్సిపల్ సిబ్బంది ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ సూచించారు. పిలారిపట్టు, గోపాలకృష్ణపురం, నేసనూరుల్లో విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

పుత్తూరు: వర్షం విడవకుండా పడుతుండడంతో చిన్నాపెద్దా చెరువులు నిండి కలుజులు పారుతాయని ఇరిగేషన్ ఏఈ పరశురామ్‌నాయక్ తెలిపారు. మండలంలోని 34 చెరువులలో ఇప్పటికే 8 చెరువులు నిండగా మిగిలినవి పూర్తిగా నిండేందుకు సిద్ధంగా వున్నాయని అన్నారు. గూళూరు చెరువు కలుజు పారడం వల్ల పైడిపల్లి కాజువే పొంగి పొరలుతోంది. అలాగే మూలకోన నుంచి వచ్చే వాగు, నేసనూరు చెరువు కలుజు ఉధృతంగా పారుతోంది. దీంతో నేసనూరు నుంచి ప్రారంభమై పిచ్చాటూరుకు చేరే అరుణానది పరవళ్లు తొక్కుతోంది. గురువారం సాయంత్రం 6 గంటల వరకు 95.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రమాదపుటంచుల్లో పాదిరేడు పెద్ద చెరువు

జారిన చెరువు కట్ట ● పరిశీలించిన ఆర్డీవో



పాదిరేడులో స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీవో

వడమాలపేట, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాదిరేడు పెద్ద చెరవు ప్రమాద స్థితికి చేరుకుంది. చెరువు కట్ట సుమారుగా 20 అడుగుల మేర జారింది. విషయం తెలుసుకున్న తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ కట్టను పరిశీలించారు. కట్ట పటిష్ఠ పరిచడానికి ఇసుక బస్తాలు వేస్తున్నట్లు చెప్పారు. అలాగే చెరువులో నీటి ఉధృతి తగ్గించడానికి కలుజు కట్ట వద్ద కొంత తవ్వి దిగువుకు నీళ్లు వదిలారు. పాదిరేడు చెరువును ఇరిగేషన్ ఈఈ వెంకటేష్ ప్రసాద్, డీఈ శ్రీనివాసులు, ఏఈ మురళిమోహన్, తహసీల్దార్ జరీనా, ఎస్‌ఐ ధర్మారెడ్డి పరిశీలించారు.

వడమాలపేట: మండలంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు 140.02 మిమీ వర్షపాతం నమోదైంది. మండలంలోని అన్ని చెరువులు నిండి కలుజు పారుతున్నాయి. వడమాలపేట సమీపంలోని కాజ్‌వేపై నీరు ఉధృతంగా పారుతుండడంతో రాకపోకలు స్తంభించాయి. పోలీసులు రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు పెట్టి వాహనాలు బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించారు. అలాగే పాదిరేడు వెళ్లే రోడ్డులో కాల్వపై నీళ్లు పొర్లుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి.కల్లూరు వద్ద నక్కల వాగు వంతెన పై ఐదు అడుగుల మేర నీరు పారుతోంది. దీంతో కల్లూరువాసులు టీసీ అగ్రహారం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. వడమాల కాజ్‌వేపై నీరు పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి.


పొంగిపొర్లుతున్న వడమాలపేట కాజ్‌వే

రైల్వే అండర్ బ్రిడ్జి నీటిలో చిక్కుకున్న కారు



వడమాలపేట, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమాపురం రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీటిలో కారు చిక్కుకుంది. గురువారం ఉదయం వడమాలపేట నుంచి అప్పలాయగుంటకు వెళ్తున్న కారు బ్రిడ్జి నుంచి వెళ్తుండగా ఉన్నట్టుండి ఇంజిన్ ఆగిపోయింది. కొంతసేపటికి కారు పూర్తిగా మునిగిపోయే స్థితికి చేరుకుంది. ఇంతలో అక్కడే ఉన్న స్థానికులు కారు దగ్గరకు చేరుకుని డోర్లు తెరిచి లోపల ఉన్న ఇద్దరిని రక్షించారు. అనంతరం ట్రాక్టర్ సాయంతో కారును బయటికి లాగారు.

సెలవు ప్రకటన ఆలస్యం: వర్షంలో విద్యార్థుల తిప్పలు



పుత్తూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షంపై వాతావరణ శాఖ ముందే హెచ్చరించినా విద్యాశాఖ మొద్దు నిద్ర పోయింది. గురువారం యథావిధిగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు తెరుచుకున్నాయి. విద్యార్థులు పాఠశాల వాహనాల్లో, ఆటోల్లో, గొడుగులేసుకుని పాఠశాలలకు చేరుకున్నారు. పాఠశాలలు ప్రారంభమయ్యే 15 నిమిషాల ముందు వర్షం కారణంగా సెలవు ప్రకటిస్తున్నట్లు విద్యాశాఖ జిల్లా అధికారులు ప్రకటించారు. ఈ యేరకు ఎంఈవోలు వాట్సప్‌ల ద్వారా పాఠశాలలకు సమాచారం చేరవేశారు. దీంతో చేసేదీమీ లేక పిల్లలను ఇళ్లకు పంపించారు. వానలో తడుచుకుంటూ పిల్లలు ఇంటి దారి పట్టారు. ఇకనైనా వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ముందస్తుగా సెలవు ప్రకటించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

గంధ మహోత్సవానికి ఎమ్మెల్యేకి ఆహ్వానం



పుత్తూరు అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పుత్తూరు గేటు ఆనంబట్టు రోడ్డులోని ఖాదర్ వలీ దర్గా జెండామాను గంధ మహోత్సవం ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ముస్లిం పెద్దలు పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మహోత్సవానికి ఆహ్వానించారు. టీడీపీ ముస్లిం మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ఖాజాపీర్, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి మహమ్మద్ నబీ, పుత్తూరు పట్టణ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, కరీం ఆలీషా, సలీం, షాజహాన్, శంషు, నసురుల్ల తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయం: టీడీపీ

పుత్తూరు అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సినీనటుడు మోహన్‌బాబు, ఆయన తనయుడు మంచు మనోజ్ వ్యక్తిగత పంచాయితీలో జర్నలిస్టులపై దాడి చేయడం హేయనీయమని పుత్తూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్.ఎస్.ధనపాల్ పేర్కొన్నారు. ప్రభుత్వం జర్నలిస్టులకు అండగా ఉంటుందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి నడుమ వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల పట్ల దురుసుగా ప్రవర్తించాడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

బాలాయపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కయ్యూరు, సుబ్రమణ్యం గ్రామాల్లో గురువారం తహశీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామస్థుల నుంచి అధికారులు 23 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: మండలంలోని పలుగోడు, సూరాయపాళెం గ్రామాల్లో అధికారులు గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పలు సమస్యలపై ప్రజలు తహశీల్దారు శ్రీనివాసులుకు అర్జీలు అందించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో రైతుల భూసమస్యలు పరిష్కారమవుతున్నాయని టీడీపీ మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. గురువారం మండలంలోని చింతపూడి గ్రామంలో తహశీల్దారు ద్వారకానాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఉప సర్పంచ్ రాపూరు కస్తూరమ్మ, నాయకులు సిద్దులయ్యనాయుడు, శేఖర్‌నాయుడు, మురళీనాయుడు, పరుశురామ్ తదితరులు ఉన్నారు.


చింతపూడి గ్రామంలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కోట: మండల పరిధిలోని కేశవరంలో గురువారం జరగాల్సిన రెవెన్యూ సదస్సు భారీ వర్షం కారణంగా వాయిదా వేసినట్లు తహశీల్దారు జయజయరావు తెలిపారు. జనవరి 6న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం చెందోడులో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని తెలిపారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

దొరవారిసత్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలో గురువారం ఉదయం గంజాయితో రోడ్డుపై నిలిచి ఉన్న ఇద్దరు ఒడిస్సా వాసులను ఎస్‌ఐ అజయ్‌కుమార్ అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన యాసిన్ మల్లి, శామ్‌సన్‌పాల్ దొరవారిసత్రంలో మండల కార్యాలయ కూడలి వద్ద హైవేపై బస్సు ఎక్కేందుకు వేచి ఉండగా.. వారిపై అనుమానంతో తనిఖీ చేశారు. వారి వద్ద 6.5 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వారి నుండి సేకరించిన సమాచారం మేరకు కేరళ రాష్ట్రంలో ఓ హోటల్‌లో పనిచేసే వీరు గత కొంతకాలంగా ఒడిస్సా నుంచి కేరళకు తక్కువ మోతాదులో గంజాయిని తరలిస్తున్నట్లు తెలిసింది. పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన పోలేరమ్మ జాతర

కోట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడులో 6 రోజులపాటు జరిగిన గ్రామదేవత జాతర మహోత్సవాలు గురువారం ముగిశాయి. గ్రామదేవత చిట్టేటమ్మ, మహాలక్ష్మమ్మ, అంకమ్మ, చెంగాళమ్మ, బంగారమ్మ, పోలేరమ్మ గ్రామదేవతల జాతర నిర్వహించారు.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు

చిట్టమూరు, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తగుంట గ్రామంలోని ఓ షాపులో పని చేసే ఈదూరు శివపై కానిస్టేబుల్ చంద్ర దాడి చేసిన కేసులో చిట్టమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. శివ అనే వ్యక్తి కొత్తగుంటలో ఓ షాపులో పని చేస్తున్నాడు. నాయుడుపేట పోలీస్‌స్టేషన్‌లో పని చేసే చంద్ర ఈ నెల 9న కొత్తగుంటకు వచ్చి శివతో గొడవ పడి చేయి చేసుకున్నట్లు తెలిపారు. షాపులో ఉన్న సీసీ ఫుటేజ్ ఆధారంగా చిట్టమూరు పోలీసులకు శివ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కానిస్టేబుల్ చంద్ర గతంలో చిట్టమూరులో పని చేస్తుండగా అవినీతి ఆరోపణలు రావడంతో నాయుడుపేటకు బదిలీ చేశారు.

డీఆర్ఈయూ విజయంతో రైల్వే ఉద్యోగుల సంబరాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో దక్షిణ రైల్వే ఎంప్లాయీస్ యూనియన్ (డీఆర్ఈయూ) విజయం సాధించడంతో గురువారం సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లో రైల్వే ఉద్యోగులు సంబరాలు చేసుకొన్నారు. రైల్వేలో 11 సంవత్సరాలు తరువాత ఈ నెల 4, 5 తేదీల్లో సదరన్ రైల్వే చెన్నైకి సంబంధించి రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల నిర్వహించారు. గురువారం 12న జరిగిన కౌంటింగ్‌లో సదరన్ రైల్వేలో గతంలో ఎన్నడూ లేని విధంగా డీఆర్ఈయూ 25,815 ఓట్లతో 40.33 శాతంతో మొదటి స్థానానికి చేరుకొని ఘన విజయం సాధించింది. దీంతో ఉద్యోగులు సంబరాలు చేసుకొన్నారు.

శాస్త్రోక్తంగా బాలదీపాల వెలిగింపు



ఆలయంలో ఏర్పాటుచేసిన కలశం - ఊరేగింపుగా తీసుకెళుతున్న బాలదీపాలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం బాలదీపాలను శాస్త్రోక్తంగా వెలిగించారు. యేటా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకని మహానంది వద్ద చుక్కాని ఉత్సవం(భరణి దీపం) వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ వేడుకకు ఒకరోజు ముందుగా శాస్త్రోక్తంగా బాలదీపాలను వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా గురువారం స్వామి అమ్మవార్ల గర్భాలయాలను శుద్ధి చేశారు. ఆగమ నియమం ప్రకారం అమ్మవారి సన్నిధిలో గురువారం రాత్రి వేదపండితులు ప్రత్యేక పూజలతో హోమ జ్వాల నుంచి ఐదు బాలదీపాలను సంప్రదాయబద్ధంగా వెలిగించారు. అనంతరం బాలదీపాలను వేదపండితులు స్వామివారి సన్నిధిలో కొలువుదీర్చారు. శుక్రవారం సాయంత్రం బాలదీపాలను వేదపండితులు ఊరేగింపుగా చుక్కాని వద్దకు తీసుకెళ్లనున్నారు. అక్కడ బాలదీపాలను ఉంచి ప్రత్యేక పూజల అనంతరం చక్కాణి(భరణిదీపం)ను ప్రజ్వలించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించనున్నారు. గురువారం రాత్రి శుక్రవారం భరణి దీపం వరకు బాలదీపాలు నిరంతరం వెలిగేలా స్వామివారి సన్నిధిలో ఏర్పాటు చేశారు.

నేడు భరణి దీపం...

శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి చుక్కాని(భరణి దీపం) వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. భక్తులు విశేషంగా దర్శించుకునేందుకు విచ్చేస్తారు. ఇందుకు అవసరమైన తాటిచెట్టు, మట్టలు, పూజాద్రవ్యాలను అధికారులు సిద్ధం చేశారు.

యాజమాన్య పద్ధతులు అవలంబించేలా చూడండి

పుత్తూరు టౌన్, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో నూతన శాస్త్ర పరిజ్ఞానాన్ని రైతుల దరి చేర్చి వారి అభివృద్ధికి సహాయపడాలని వ్యవసాయ శాఖ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. పుత్తూరు, సత్యవేడు డివిజన్ల రైతు సేవా కేంద్రాల సిబ్బందికి పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో గురువారం శిక్షణ ఇచ్చారు. సాగులో అధిక దిగుబడులకు, చీడలను ఎదుర్కొనే విధానం, జీవ ఎరువులు, పురుగు, తెగుళ్ల నివారణ మందులు, సేంద్రియ ఎరువులు, డ్రోన్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాలరావు, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త సుధాకర్, డీటీసీ భాస్కరయ్య, ఏవో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి కాంపౌండ్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



పుత్తూరు టౌన్, డిసెంబర్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ లూథరన్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, టీడీపీ నాయకులు డీఎస్ ఎలుమలై, ధనపాల్, డిజి ధనపాల్, శ్రీనివాసులు, రూపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తూర్పున కుంభవృష్టి

కాజ్‌వేలపై ఉధృతంగా నీరు
లోతట్టు ప్రాంతాలు జలమయం
నీట మునిగిన పొలాలు



ముండ్లపూడి వద్ద ఉధృతంగా పారుతున్న స్వర్ణముఖి నది





జలమయమైన బలరాం థియేటర్ సందు



గుడిమల్లం వద్ద ప్రవహిస్తున్న సీతకాలువ



ఏర్పేడులో భారీ వర్షాలకు నీట మునిగిన పొలాలు









రాజులకండ్రిగ వద్ద తెగిపోయిన మట్టి వంతెన - నీర్పాకోట వద్ద నీటమునిగిన వరి - బీఎన్‌కండ్రిగలో పొలంలో పారుతున్న నీరు - కాళంగి నీటితో ఉధృతంగా కాటూరు యేరు

శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తూర్పు మండలాల్లో గురువారం కుంభవృష్టి వర్షం కురిసింది. బుధవారం రాత్రి ప్రారంభమైన వర్షం విడిచి విడిచి కురిసింది. గురువారం వేకవ జామున 3గంటల నుంచి జోరువాన మొదలైంది. ఉదయం 9గంటల నుంచి ఏకధాటిగా వర్షపు జల్లులు కురిసాయి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎడతెరపిలేకుండా కుండపోత వర్షం పడింది. పట్టణంలోని పలు వీధుల్లో నీరు రోడ్లపై ప్రవహించింది. స్వర్ణముఖి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. ముళ్లపూడి సహా పలు లోలెవల్ కాజ్‌వేలపై వర్షపునీరు ఉధృతంగా ప్రవహించింది. ఈ మార్గంలో రాకపోకలు స్తంభించాయి, కాపుగున్నేరి వద్ద రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద భారీగా నీరు చేరడంతో ఎంఎంసీ కండ్రిగ నుంచి రాకపోకలు సాగించారు. మండలంలోని చెరువులన్నీ వందశాతం నీటితో నిండిపోయాయి. వేడాం భైరవకాలనీ, భైరవ ఎస్టీకాలనీ వాసులకు రెవెన్యూ అధికారులు పునరావాసం కల్పించారు. తొట్టంబేడు మండలం కారాకొల్లు, చిట్టత్తూరు వద్ద కాలువలు రోడ్డుపై ఉధృతంగా ప్రవహించాయి.ఈ మార్గాల్లో రాకపోకలను నిలిపివేశారు. సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ ఈశ్వరయ్య ప్రజలకు అవగాహన కల్పించారు.

కేవీబీపురం: మండలంలోని కోవనూరు, తిమ్మసముద్రం వద్ద కాళంగి కాలువలు పొంగి రోడ్డుపై పారుతున్నాయి. దీంతో శ్రీకాళహస్తి - పిచ్చాటూరు మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్‌ఐ ఓబయ్య సిబ్బందితో తిమ్మసముద్రం వద్ద హెచ్చరిక బ్యారికేడ్లు ఏర్పాటు చేయించారు. రాబోయే 24గంటలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు మునిరత్నంరెడ్డి చెప్పారు.

బుచ్చినాయుడుకండ్రిగ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. నీర్పాకోట, కుక్కంబాకం, ఆర్.అనంతపురం, పల్లమాల, చిన్నపాలేడు, జంబుగోళం, కాంపాళెం, కుక్కంబాకం చెరువులు కలుజులు పారుతున్నాయి. కంచనపుత్తూరు చెరువు నిండిపోవడంతో ఎక్స్‌కవేటర్‌తో కట్ట చివరి భాగంలో తెగొట్టారు. కనమనంబేడు వెళ్లే దారిలోని అరుంధతి వాడ సమీపంలో కొన్ని ఇళ్లలోని నీరు చేరింది. కేటీ రోడ్డుపై నీరు పారడంతో వాహనదారులు ఇబ్బం దులు పడ్డారు. బుధవారం రాత్రి నుంచి గురు వారం మధ్నాహ్నం 2గంటల వరకు 73.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు వర్షాలకు ప్రజల ఇబ్బందులు పడకుండా గ్రామాలను పరిశీలించారు.

రేణిగుంట: మండలంలో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు 75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అన్నాస్వామిపల్లి, కల్లూరు, అత్తూరు గ్రామాలకు వెళ్లే మార్గాల్లో వాగులు ఉధృతంగా సాగుతుండడంతో ముందస్తు జాగ్రత్తగా పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ఆ మార్గాలను మూసివేశారు. అలాగే మర్రిగుంట చెరువు నిండి కలుజు పారుతోంది. దీంతో లోతట్టు ప్రాంతమైన బాలాజీ కాలనీ జలదిగ్బంధంలో చిక్కుకుంది. సమాచారం అందుకున్న ఎంపీడీవో చిరంజీవి, ఈవోపీఆర్డీ ప్రభురావు, సిబ్బంది కాలనీకి చేరుకుని ఐదు కుటుంబాల వారిని పునరావాస కేంద్రానికి తరలించారు. వివేకానంద, భగత్‌సింగ్ కాలనీల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరింది. వెంకటాపురంలో 25 ఎకరాల వరి నీట మునిగింది. అల్లిమిట్ట వద్ద వాగు పొంగడంతో సమీపంలోని ఎస్టీ కాలనీలోకి నీళ్లు చేరడంతో టీడీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డి కాలనీవాసులకు ఆహారం అందించారు. రెండు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు.

ఏర్పేడు: భారీ వర్షాలతో మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.చిందేపల్లి, జంగాలపల్లి, పంగూరు, రాజులపాళెం, గుడిమల్లం, వికృతమాల, మోదుగులపాళెం, కోబాకల్లో కొంతమంది రైతులకు సంబంధించిన వరి నాట్లు నీట మునిగాయి. గుడిమల్లం గ్రామానికి వెళ్లే మార్గంలో సీతకాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పరశురామేశ్వరాలయానికి రావద్దని గురువారం ఆలయ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. చెన్నంపల్లి గ్రామానికి వెళ్లే రహదారి నక్కలవాగులో కొట్టుకుపోయింది. అదే విధంగా ముసలిపేడు వద్ద శ్రీకాళహస్తికి వెళ్లే దారి కూడా నీట మునిగింది.

సత్యవేడు: మండలంలో వర్షం జోరున కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం ఒరకు ఒకే వర్షం. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లమీద వర్షపునీరు పరవళ్లు తొక్కింది. ప్రధానంగా గాంధీ విగ్రహం, తిరుపతి బస్టాండు, శ్రీకాళహస్తి బస్టాండు పరిసరాల్లో చిరువ్యాపారులకు ఈ వర్షం ఆటంకం కలిగించింది. కోమటిగుంటలో ఇళ్లలోకి నీరు చేరడంతో వారి అవస్థలు వర్ణనాతీతం. అధికారులు తమను పట్టించుకోవడం లేదని వారు వాపోయారు.

వరదయ్యపాళెం: మండలంలో వర్షం కారణంగా ప్రజలు ఇబ్బంది పడ్డారు. పొలాలు నీట మునిగాయి. కంచరపాళెం వంతెనపై నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చావాలి లింగమనాయుడుపల్లి కాలువ ఉధృతి పెరిగింది. చెన్నావారిపాళెంలో పలు ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. మండలంలో గోవర్ధనపురం వంతెనపై బస్సు నిలిచిపోవడంతో ట్రాక్టరు ద్వారా అక్కడి నుంచి తరలించారు.







కోమటిగుంటలో పారుతున్న నీరు - ఉధృతంగా సంతవేలూరు- అంబూరు కాజ్‌వే - గోవర్ధనపురం వద్ద నీటిలో చిక్కుకుపోయిన బస్సు



పాముల కాలువ ఉధృతి

గురుదక్షిణామూర్తికి శాస్త్రోక్తంగా పూజలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక కతృవులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రయం కల్పించాలంటూ షికారీల నిరసన

వరదయ్యపాళెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తమకు ఆశ్రయం కల్పించి భోజనాలు అందించాలంటూ చిన్నపాం డూరు సమీపంలో షికారీలు గురువారం మధ్యాహ్నం సత్యవేడు వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గంలోని నకల్కలమిట్ట వద్ద రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా వాహన రాకపోకలు స్తంభించాయి. దీంతో పరిశ్రమలకు వెళ్లే కార్మికులు ఈ ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న శ్రీసిటీ డీఎస్పీ వైడేశ్వరరావు అక్కడికి చేరుకుని షికారీలతో చర్చించి వసతులు కల్పిస్తామని చెప్పడంతో వారు ధర్నా విరమించారు. అనంతరం పోలీసులు రాకపోకలను పునరుద్ధరించారు.



షికారీలకు నచ్చచెబుతున్న పోలీసులు

లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం

శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈనెల 14వ తేదీ శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ కోరారు. ఉదయం 10.30గంటల నుంచి జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్, వివాహ, మోటరు వాహన సంబంధ కేసులతో పాటు రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, వ్యాజ్యం వేయని కేసులు పరిష్కరిస్తామన్నారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు వివిధ సంస్థ అధికారులు ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం కావడానికి కృషి చేయాలన్నారు.



న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆదుకోండి: సీపీఎం

శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): లోతట్టు ప్రాంతల్లో నివసిస్తున్న పేద లను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య కోరారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతలు జలమయమయ్యాయన్నారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావం నుంచి కోలుకుంటున్న ప్రజలకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు మరింత ముప్పులోకి నెట్టాయన్నారు. వర్షాలతో వ్యవసాయ, భవన నిర్మాణ రంగ కూలీలకు పని కరువైందన్నారు. ప్రతి కుటుంబానికీ నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పటణంలోని 4వ వార్డు పరిధిలో టీడీపీ కార్యకర్త సుబ్రహ్మణ్యం తల్లి పండమ్మ గురువారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి అక్కడికి చేరుకుని పండమ్మమృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సుబ్రహ్మణ్యంను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, మణి, రామమూర్తి, రాంబాబు, బాబు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సంతాన సంపద వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఏర్పేడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాలలో కొలువై ఉన్న సంతానసంపద వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి నేత్రదర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్త పసుపులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు కృష్ణమాచార్యులు, రత్నాకరం ఆచార్యులు స్వామివారిని అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ పూజల్లో పాల్గొన్నారు.



కాప్రికార్న్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

వరదయ్యపాళెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలంలోని కాప్రికార్న్ పరిశ్రమ యాజామన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు, సత్యవేడు ఇన్‌చార్జి దాసరి జనార్దన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సత్యవేడు మండలం పాలగుంట గ్రామం సమీపంలో ఉన్న కాప్రికార్న్ పరిశ్రమలో 20 సంవత్సరాలుగా పనిచేస్తుండిన 45 మంది కార్మికులను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా విధుల నుంచి అర్ధాంతరంగా తొలగించడం దారుణమన్నారు. తొలగించడంపై నిలదీస్తే భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తుపాకులతో భయపెడుతున్న పరిశ్రమ అధికారులపై కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

గ్రామస్తులకు భోజనం పంపిణీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పంచాయతీకి చెందిన గణపతి ఎస్టీకాలనీవాసులకు భోజనం పంపిణీ చేశారు. తుపాన్ కారణంగా ఇబ్బంది పడుతున్న స్థానికులకు రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో భోజనం పంపిణీ చేశారు. రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఉమ్మడిగా కాలనీవాసులకు భోజనం అందజేశారు.

డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమం



శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కాసీతమ్మ స్ఫూర్తితో ప్రతి గురువారం అన్నదానం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో అన్నదానం చేశారు. చంద్రశేఖర్, జ్యోతిరాం, పేట చిరంజీవి, హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యత

రేణిగుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాల నిర్మూలన అందరి బాధ్యతని పద్మావతి మహిళా యూనివర్శిటీ అధ్యయన కేంద్ర ప్రాజెక్టు అసోసియేట్ డాక్టర్ ఇ.కోనప్రభ తెలిపారు. మండలంలోని గాజులమండ్యం గ్రామంలో స్వయం సహాయ సంఘ సభ్యులకు బాల్యవివాహాల నిర్మూలనపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. అవగాహన లేనికారణంగా బాల్యవివాహాలు జరుగుతున్నాయని చెప్పారు. బాల్యవివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర ఆఫీస్ అసిస్టెంట్ డాక్టర్ ఎం.సుచరిత, స్వయం సహాయ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నిరంతరాయ విద్యుత్‌కు చర్యలు



ఏర్పేడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో తలెత్తిన విద్యుత్ సమస్యలను ట్రాన్స్‌కో అధికారులు ఎక్కడికక్కడ పరిష్కరించారు. బండారుపల్లిలో వర్షం కారణంగా తెగిన తీగకు వెంటనే సరి చేశారు. జంగాలపల్లి ఐసర్ వద్ద ఏడీఏ సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేయించారు.

వర్షంలోనూ రెవెన్యూ సదస్సు



తిమ్మభూపాలపురంలో జరిగిన సదస్సు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా తిమ్మభూపాలపురంలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో పట్టాదారు పాసుపుస్తకాల కోసం, భూ సమస్యల పరిష్కారం కోసం 12 అర్జీలు వచ్చినట్లు డీటీ చంద్రబాబు నాయుడు తెలిపారు. సర్పంచు అంకమ్మ, ఆర్‌ఐ నల్లయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

రద్దైన రెవెన్యూ సదస్సులు

రేణిగుంట: తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షం కారణంగా గురువారం అన్నాస్వామిపల్లిలో జరగాల్సిన రెవెన్యూ సదస్సును రద్దు చేసినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. ఈ సదస్సులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొనాల్సి ఉందన్నారు. అయితే వర్షంకారణంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా రద్దు చేసినట్లు చెప్పారు. మళ్లీ సదస్సును ఎప్పుడు నిర్వహించేది ప్రకటిస్తామని తెలిపారు.

ప్రజల వద్దకు పాలన



దుర్తిపేరిలో జరిగిన రెవెన్యూ సదస్సు

ఏర్పేడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకు పాలన తెచ్చి సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు నైనారు పొన్నారావు అన్నారు. మండలంలోని దుర్తిపేరిలో గురువారం జరిగిన రెవెన్యూ జరిగింది. ఈ కార్యక్రమంలో డీటీ రోజారమణి, ఆర్‌ఐ కూనాటి సుబ్రహ్మణ్యం, రెవెన్యూ అధికారి మునస్వామి, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, రెడ్డి హరిరెడ్డి పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించండి

శ్రీకాళహస్తి, డిసెంబరు 12(ఆంధ్ర జ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. గురువారం పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఆర్టీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండు ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామీణ ప్రజలు, విద్యార్థుల సౌకర్యార్థం పల్లెవెలుగు బస్సులను పెంచాలని సూచించారు.



అధికారుకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే



కాపుగున్నేరి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద వర్షపు నీరు

In the court of the Senior Civil Judge & JMFC Tiptur
M.C.No. 41/2024

Petitioner: S.M.pooja Vs Respondent: E.R.Teja

Notice to Respondent:-

Where as the above named **S.M.Pooja** aged about 30 years **W/o E.R.Teja** and **D/o S.D.Manohara**, Residing at Sri Kannikaparmeshwari Temple Road, Tiptur town has filed the above petition against **E.R.Teja** aged about 33 years **S/o E.Ravichandra**, Residing at Bangaramma Colony, 8th Cross, Upstairs, Sri. Kalahasti, Chittoor District Andhra Pradesh-517644 for Dissolution of Marriage by a decree of divorce and you are hereby directed to appear before this Hon'ble court in person or by a pleader duly instructed on the **29th day of January 2025 at 11 A.M.** Take notice that in default of your appearances on the day above mentioned, the case will be heard and decided in your absence.

Given under my hand and seal of the court, this 10th day of december 2024.

Advocate for Petitioner, K.S.Ramaswamy Iyengar, Advocate, Tiptur, Tumkur District, Karnataka State

By Order of the Court Senior Civil Judge & JMFC Tiptur, Tumkur District, Karnataka State